

సీబీఎస్ఈ.. శూన్యం

- సర్కారు బడుల్లో చతికలబడ్డ బోధన
- అంతర్గత పరీక్షల్లో 65 శాతం విద్యార్థులు ఫెయిల్
- ఈ ఏడాది పది పరీక్షలు లేనట్లే..
- స్టేట్ సిలబస్‌తోనే పరీక్షలకు సన్నద్ధం చేసే ప్రణాళిక
- ఉమ్మడి జిల్లాలో 35కు పైగా సీబీఎస్ఈ పాఠశాలలు

గుంటూరు(విద్య),ఆగస్టు 28: సర్కారు బడుల్లో ఆర్భాటంగా ప్రవేశ పెట్టిన సీబీఎస్ఈ బోధన.. 'ఆదిలోనే హంసపాదు' అన్న చందంగా తయారైంది. సరైన ప్రణాళిక, బోధన, ప్రమాణాలు పాటించకపోవడం, ఉపాధ్యాయులకు కొరవడిన శిక్షణ వంటి అంశాలు విద్యార్థుల పాలిట శాపంగా మారాయి. ఫలితంగా సిబిఎస్ఇలో చదివినా ఈ ఏడాది పరీక్షలకు హాజరుకాలేని దుస్థితి. గత వైసీపీ ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో దాదాపు 35 కు పైగా పాఠశాలల్లో సీబీఎస్ఈ బోధన ప్రవేశ పెట్టింది. ఆయా పాఠశాలల్లో ప్రస్తుతం పదవ తరగతిలో ఉన్న విద్యార్థినీవిద్యార్థుల సంఖ్య 5 వేల వరకు ఉన్నారని సమాచారం. ఈ విద్యార్థులు వచ్చే మార్చి, ఏప్రిల్‌లలో సెంట్రల్ బోర్డు ఆఫ్ సెంకడరీ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో జరిగే పరీక్షలు రాయాల్సి ఉంటుంది. అయితే, విద్యార్థులను ఆ దిశగా పరీక్షలకు సన్నద్ధం చేసిన దాఖలాలు దాదాపు శూన్యం. పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల్లో వారి నైపుణ్యాలు పరిశీలించడానికి ఇటీవల పాఠశాల విద్యాశాఖ అంతర్గతంగా పరీక్షలు నిర్వహించింది. ఆంగ్లం, సైన్స్, సోషల్ స్టడీస్, గణితం విభాగాల్లో నిర్వహించిన పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ చూసి అధికారులు నివ్వెరపోయారు. ఎందుకంటే, కనీసం 65 శాతం మంది విద్యార్థులు నైపుణ్య పరీక్షలో ఫెయిల్ అయ్యారు. వీరు సిబిఎస్ఇ విధానంలో జరిగే పరీక్షలకు హాజరైతే భారీమూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విద్యార్థులను రాష్ట్ర స్థాయిలో జరిగే ఎస్ఎస్‌సి పరీక్షలకు సన్నద్ధం చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

నాటి తప్పుడు నిర్ణయాలు.. విద్యార్థులు తిరోగమనం వైపు

గత వైసీపీ ప్రభుత్వం విద్యా రంగానికి సంబంధించి నాడు చేసిన సంస్కరణలు, తీసుకున్న అనేక తప్పుడు నిర్ణయాలకు విద్యార్థులు ఇప్పుడు మూల్యం చెల్లించుకుంటున్నారు. ప్లస్ టు విధానం ప్రవేశ పెట్టి అక్కడ కనీస వసతులు, బోధనకు అధ్యాపకులను నియమించలేదు. ఫలితంగా అక్కడ చదివిన విద్యార్థులు 90 శాతం ఫెయిల్ అయ్యారు. ఇలా పేద విద్యార్థులను ఇంటర్ విద్యకు దూరం చేశారు. ఐబి సిలబస్,టోఫెల్ బోధన, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబుల పంపిణీ, బైజూస్ ఒప్పందాలు ఇలా ఎన్ని ఆర్భాటాలు చేసినప్పటికీ అవి విద్యార్థులకు ఉపయోగపడక పోగా, వారిని తిరోగమన దిశలో పయనించేలా చేశాయి. సీబీఎస్ఈ విధానం కూడా అదే మాదిరి తయారవడంపై పలు విమర్శలు వస్తున్నాయి.

ఉపాధ్యాయులను సన్నద్ధం చేశారా?

ఉమ్మడి జిల్లాలో సీబీఎస్ఈ విధానంలో పాఠశాలలు ప్రారంభించడానికి ముందస్తు సన్నాహాలు ప్రభుత్వం చేయలేదు. ప్రధానంగా, ఉపాధ్యాయులకు కనీస శిక్షణ ఇవ్వలేదన్న ఆరోపణలు ఉన్నాయి. సీబీఎస్ఈ విధానంపై అమలుకు అవసరమైన మౌలిక వసతులు పాఠశాలల్లో కల్పించలేదు. సిబిఎస్ఇ బోర్డు సూచించిన విధానంలో ఎటువంటి ముందస్తు క్రొాళికా లేకుండానే తరగతులు ప్రారంభించారు. దీంతో, విద్యార్థులను అందుకు అనుగుణంగా సన్నద్ధం చేయడంలో ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోలేదు. సీబీఎస్ఈలో బోధన అంతా విద్యార్థిలో నైపుణ్యాలను వెలికితీయడమే లక్ష్యంగా సాగుతుంది. విద్యార్థులను ఎటువంటి ఒత్తిళ్ళకు గురిచేయకుండా బోధన సాగుతుంది. విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే పాఠ్యపుస్తకాల నుంచే సొంతంగా నోట్స్ తయారు చేసుకుని పరీక్షలకు హాజరయ్యేలా సన్నద్ధం చేస్తారు. ఇందులో భాగంగా విద్యార్థులకు 20 మార్కులు ఇంటర్నల్‌లో కేటాయిస్తారు. సిబిఎస్ఇలో టీచింగ్‌లెర్నింగ్ మెటీరియల్‌ను ఉపాధ్యాయులు వినియోగిస్తారు. ఉపాధ్యాయులకు ప్రతి సబ్జెక్టుకు సంబంధించిన బోధనపై ఏటా ప్రత్యేక శిక్షణా తరగతులు ఉంటాయి. ఇందుకు ఎన్‌సిఇఆర్‌టిలో ప్రత్యేకంగా శిక్షణ పొందిన అధ్యాపకులు, ప్రొఫెసరుల సహాయం తీసుకుంటారు. ఇలా అనేక విషయాలు బోధన విషయంలో అమలు చేస్తారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం ఇవేమీ పట్టించుకోకుండా హడావుడిగా సీబీఎస్ఈ ప్రవేశ పెట్టడంతో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిది.

భద్రతకు ప్రాధాన్యమివ్వాలి

- ప్రమాదకర కేటగిరిలో 22 పరిశ్రమలు
- కలెక్టర్ నాగలక్ష్మి


పరిశ్రమల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

గుంటూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పరిశ్రమల్లో ప్రమాదాలను నివారించేందుకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి పరిశ్రమల యాజమాన్యాలను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో కలెక్టర్ పరిశ్రమల్లో భద్రతా ఏర్పాట్లపై అధికారులు, పరిశ్రమల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లా స్థాయి కమిటీ నిర్వహించిన సేఫ్టీ ఆడిట్‌లో ప్రమాదకర కేటగిరిలో 22 పరిశ్రమలు ఉన్నట్లు తేలిందన్నారు. ఈ క్రమంలో నిర్దేశిత భద్రతా ప్రమాణాలను నిరంతరం ఖచ్చితంగా పాటించాలని కలెక్టర్ ఆయా యాజమాన్యాలను ఆదేశించారు. ప్రమాదకర రసాయనాలు, వాయువులు వినియోగించే పరిశ్రమలు సంబంధిత యంత్రాల నిర్వహణను నిరంతరం అప్రమత్తంగా ఉంటూ నిర్లక్ష్యం లేకుండా తనిఖీలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రమాదాల నివారణకు నిర్దేశించిన ఎస్ఓపీ ప్రకారం అన్ని ముందస్తు జాగత్తలు, ఏర్పాట్లు చేసి సంబంధిత శాఖల నుంచి నిరభ్యంతర అనుమతులు పొందాలని యాజమాన్యాలకు తెలిపారు. ప్రమాదకర కేటిగిరిలోని పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు తప్పని సరిగా పూర్తిస్థాయిలో వ్యక్తిగత భద్రత కిట్లు అందించాలని, మాక్ డ్రిల్,సేఫ్టీ సమావేశాలు తరుచు నిర్వహించాలన్నారు. పరిశ్రమల్లో భద్రత పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించే ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయి కమిటీ పరిశ్రమలలో నిర్వహించిన సేఫ్టీ ఆడిట్‌లో గుర్తించిన అంశాలపై జారీ చేసిన నోటీసుల ప్రకారం యాజమాన్యాలు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. భద్రత ప్రమాణాలను, ముందస్తు భద్రత చర్యలను పాటిస్తూ ప్రమాదరహిత వాతావరణంలో యాజమాన్యాలు పరిశ్రమల కార్యకలాపాలు కొనసాగిస్తూ జిల్లా యంత్రాంగానికి సహకారం అందించాలన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు ఆర్ వెంకటరావు, అదనపు ఎస్పీ రమణమూర్తి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్ ఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ విలవిల

తిరుగేలేదు.. 30 ఏళ్లు మాదే అధికారం.. ఇక ప్రతిపక్షం ఆనవాళ్లే ఉండవు.. అని విర్రవీగిన వైసీపీ ప్రస్తుతం విలవిలలాడుతోంది. ఇప్పటికే గత సార్వత్రిక ఎన్నికల్లో కోలుకోలేని దెబ్బతో అల్లాడిపోతోంది. ఈ పరిస్థితుల్లో పలువురు సీనియర్లు, మాజీ ఎమ్మెల్యేల వరుస రాజీనామాలతో నేతల్లో గందరగోళం నెలకొనగా.. క్యాడర్ కలవరపడుతోంది. మొత్తంమీద 2019 ఎన్నికల్లో ఘన విజయంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఓ వెలుగువెలిగిన ఫ్యాన్ పార్టీ ప్రస్తుతం గడ్డుపరిస్థితులను ఎదుర్కొంటోంది. సార్వత్రిక ఎన్నికలకు ముందే వైసీపీ నేతలు పలువురు అధినేత జగన్‌కు షాక్ ఇచ్చారు. ఎన్నికల అనంతరం కూడా అదే పరంపర కొనసాగుతూ వస్తోంది. పార్టీ పరాజయం అనంతరం మాజీ ఎమ్మెల్యేలు మద్దాళి గిరి, కిలారి రోశయ్య రాజీనామా చేయగా తాజాగా ఎమ్మెల్సీ పోతుల సునీత అదే బాట పట్టారు. బాపట్ల జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడైన మోపిదేవి వెంకటరమణ టీడీపీలో చేరాలనే నిర్ణయం వైసీపీ నేతలను మరింత కలవరపరుస్తోంది.

ఎన్నికలకు ముందే చీ కొట్టి వచ్చేశారు..

తాడికొండ నియోజకవర్గం నుంచి 2019 ఎన్నికల్లో ప్రతిష్టాత్మక విజ యం సాధించిన ఉండవల్లి శ్రీదేవి 2024 ఎన్నికలకు ముందే జగన్‌ను ఛీ కొట్టి టీడీపీలో చేరారు. తిరిగి తనకు జగన్ సీటు ఇచ్చే ఉద్దేశంలో జగన్ లేరని ముందుగానే గ్రహించిన ఆమె వైసీపీని వీడారు. ఇక ఎమ్మెల్సీ హోదాలోనే వైసీపీలో కొనసాగిన జంగా కృష్ణమూర్తి యాదవ్ ఆ పార్టీలో తనను సర్పంచ్ కంటే హీనంగా వైసీపీలో రెడ్డి సామాజికవర్గం నేతలు చూస్తున్నారనే బాధతో ఎమ్మెల్సీ పదవిని సైతం వదులుకుని టీడీపీలో చేరారు. ఇక 2014-19 మధ్య కాలంలో టీడీపీ హయాంలో ఓ వెలుగు వెలిగిన మాజీ మంత్రి మాణిక్యవర ప్రసాద్ సైతం ఎన్నికలకు ముందే జగన్‌ను వీడి టీడీపీలో చేరారు. ఎన్ని కల సమయంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్న కత్తెర హెనీ క్రిస్టీనా దంపతులు సైతం టీడీపీలో చేరారు. దీంతో ఆ పార్టీ పరిస్థితి ఉమ్మడి గుంటూరు జిల్లాలో అగమ్య గోచరంగా మారింది.

గుంటూరు, బాపట్ల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఓ వెలుగు వెలిగిన వైసీపీ నేడు దీనావస్థలో కునారిల్లుతున్నది. గత ఎన్నికల్లో ఒక్క ఎమ్మెల్యే స్థానాన్ని కూడా దక్కించుకోకుండా ఘోర పరాజయాన్ని చవి చూసింది. ఊహించని పరిణామాలతో వైసీపీ అధినేత జగన్ మరింత కుంగిపోతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో జగన్‌కు వైసీపీ నేతలు వరుసగా షాక్ ఇస్తున్నారు. ఎన్నికలకు ముందే పలువురు వైసీపీ కీలక నేతలు జగన్ తీరు నచ్చక గుడ్ బై చెప్పిన విషయం తెలిసిందే. ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయం తర్వాత కూడా రాజీనామాల పరంపర కొనసాగుతూ వస్తోంది. బాపట్ల జిల్లాలో ఎన్నికలకు ముందు వైసీపీ ద్వితీయశ్రేణి నేతాగణం చాలా వరకు టీడీపీ బాట పట్టింది. ఈ క్రమంలో వైసీపీ కీలక నేత, రాజ్యసభ ఎంపీ, జిల్లా వైసీపీ అధ్యక్షులుగా ఉన్నటువంటి ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు ఎంపీకి రాజీనామా చేయడంతో పాటు పార్టీని కూడా వీడడానికి గురువారం ముహూర్తం ఖరారైన నేపథ్యంలో వైసీపీ పరిస్థితి మరింత గందరగోళంలో పడింది. మోపిదేవి అడుగులు టీడీపీ వైపేనన్న స్పష్టత దాదాపుగా వచ్చింది. ఇక బాపట్ల జిల్లాలోని చీరాల నియోజకవర్గానికి చెందిన పోతుల సునీత తన ఎమ్మెల్సీ పదవితో పాటు వైసీపీకి కూడా రాజీనామా చేస్తున్నట్లు బుధవారమే ప్రకటించారు. ఈ పరిస్థితుల్లో బాపట్ల జిల్లా వైసీపీలో ఏం జరుగుతుందనే అయోమయం పార్టీ శ్రేణుల్లో నెలకొంది. ఈ రాజీనామాల పరంపర ఇంతటితో ఆగబోదని మరింత మంది నేతలు టీడీపీలోకి క్యూ కట్టనున్నారనే సమాచారం వైసీపీని తత్తరపాటుకు గురిచేస్తోంది. ఎంపీ మోపిదేవి జిల్లా వైసీపీ అధ్యక్షులుగా ఉండగా, పోతుల సునీత నిన్నమొన్నటి వరకు వైసీపీరాష్ట్ర మహిళా విభాగం వంటి కీలక స్థానంలో అధ్యక్షురాలిగా పని చేశారు. వీరిద్దరూ ఒకే రోజు పార్టీని వీడుతున్నట్లు ప్రకటించడంతో వైసీపీ అధిష్టానం కంగుతిన్నది. మోపిదేవి తదుపరి అడుగులు టీడీపీ వైపేనన్న స్పష్టత రాగా, పోతుల సునీత విషయంలో ఇంకా ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. చీరాలలోని ఆమె అనుచరగణం మాత్రం బీజేపీలో చేరనున్నారనే ప్రచారం చేస్తున్నారు. ఎంపీ మోపిదేవి విషయంలో మంత్రి అనగానితో పాటు అన్ని వైపుల నుంచి సానుకూలతలు వ్యక్తం కావడం వల్లే టీడీపీ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. చేరికల విషయంలో తొందరపడకుండా ఆచితూచి నిర్ణయం తీసుకోవాలనే ఆలోచనలో టీడీపీ పెద్దలు ఉన్నట్లు తెలుస్తోంది.

2019 ఎన్నికల్లో పొన్నూరు నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన కిలారి వెంకట రోశయ్య కూడా ఇప్పటికే ఆ పార్టీని వీడారు. గత ఎన్నికల్లో ఆయన గుంటూరు లోక్‌సభ స్థానం నుంచి వైసీపీ తరపున ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. అయితే తిరిగి పొన్నూరు నుంచే ఎమ్మెల్యేగా పోటీ చేయాలని రోశయ్య భావించినా ఆయనకు అక్కడ గెలిచే అవకాశాలు లేవని భావించిన జగన్ గుంటూరు లోక్‌సభ స్థానానికి వలస తెచ్చారు. బలవంతంగా బరిలోకి దిగినా రోశయ్య పూర్తిగా కాడి కింద పడేయడంతో టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ మూడున్నర లక్షలకుపైగా మెజార్టీతో ఘన విజయం సాధించారు. తనను ఎమ్మెల్యేగా పోటీ చేయనివ్వలేదనే కోపంతో ఉన్న రోశయ్య ఇటీవల పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. అలాగే గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి 2019 ఎన్నికల్లో గెలుపొందిన మద్దాళి గిరి కూడా ఇటీవల వైసీపీకి రాజీనామా చేశారు. ఆయన 2019 ఎన్నికల్లో టీడీపీ తరపున గెలుపొంది వైసీపీ అధికారంలోకి రాగానే ఆ పార్టీలోకి జంప్ చేశారు. చిలకలూరిపేట నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆ నాటి మంత్రి రజినీని గుంటూరు పశ్చిమకు వలస తీసుకొచ్చి 2024 ఎన్నికల్లో గిరికి సీటు లేకుండా చేశారు. దీంతో ఆయనతో పాటు వైశ్య సామాజికవర్గం కూడా కొంత కినుక వహించింది. ఆ మనస్థాపంతో ఉన్న గిరి కూడా ఇటీవల ఆ పార్టీకి రాజీనామా చేశారు.

టీడీపీ ఖాతాలోకి రేపల్లె మున్సిపాలిటీ?

తీరప్రాంతంలో ఎంపీ మోపిదేవికి తన వెంట నడిచే అనుచరగణం ఉంది. ముఖ్యంగా మత్స్యకార సామాజిక వర్గం ఎప్పటి నుంచో ఆయన వెంట ఉంది. ఆయన వైసీపీని వీడి టీడీపీలో చేరనుండడంతో రేపల్లె నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు టీడీపీకి మరింత అనుకూలంగా మారనున్నాయి. ఎంపీ మోపిదేవి రాజీనామాతో రేపల్లెలో వైసీపీ దాదాపు ఖాళీ అయినట్లేననే అభిప్రాయానికి ఆ పార్టీ శ్రేణులే వచ్చాయి. రేపల్లె మున్సిపాలిటీలో మొత్తం 28 కౌన్సిలర్లకు వైసీపీ బలం 26గా ఉంది. ఎంపీ మోపిదేవితో పాటు పెద్దఎత్తున వైసీపీ నేతలు టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారని సమాచారం. దీంతో మారనున్న రాజకీయ సమీకరణాల ప్రకారం రేపల్లె మున్సిపాలిటీ టీడీపీ ఖాతాలో పడే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో గడ్డుకాలం

- సార్వత్రిక ఎన్నికల్లో క్లీన్‌స్వీప్
- వరుస రాజీనామాలతో శ్రేణుల్లో కలవరం
- ఫ్యాన్ పార్టీకి గుడ్‌బై చెప్పేందుకు సీనియర్లు సిద్ధం
- ఇప్పటికే మాజీ ఎమ్మెల్యేలు గిరి, రోశయ్య రాజీనామా
- ఎన్నికలకు ముందే పార్టీని వీడిని ఎమ్మెల్యే శ్రీదేవి, ఎమ్మెల్సీలు జంగా, డొక్కా
- టీడీపీలో చేరిన ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ క్రిస్టీనా
- తాజాగా ఎమ్మెల్సీ పోతుల సునీత రాజీనామాతో పార్టీ నేతల్లో కలవరం
- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి టీడీపీలోకి వెళ్లాలనే నిర్ణయంతో ఉలికిపాటు

ఇమడలేకపోతున్న కుడి భుజం

వైసీపీ ఆవిర్భావం నుంచి అధినేత జగన్‌కు కుడి భుజంగా మోపిదేవి వెంకటరమణ ఉన్నారు. ఆ పార్టీకి గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రస్తుతం బాపట్ల జిల్లాలో పెద్ద దిక్కుగా వ్యవహరించారు. అయితే జగన్ తీరుతో పార్టీలో ఇమడలేకపోతున్న రాజ్యసభ సభ్యుడు, మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ కూడా పార్టీని వీడేందుకు సిద్ధమవటం ఆ పార్టీకి పెద్ద షాక్‌గా చెప్పవచ్చు. జగన్ సీఎం పదవిని చేపట్టక ముందు జైల్లో ఉన్న సమయంలో ఆయనతో పాటు మోపిదేవి తోటి ఖైదీగా ఉండి ఆయనకు మరింత సన్నిహితమయ్యారు. అందువల్లే ఆయన 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పరాజయం పాలైనా మంత్రి పదవిని కట్టబెట్టి ఆ తర్వాత ఎమ్మెల్సీని చేశారు. తదనంతర పరిణామాల్లో ఢిల్లీలో తనకు ఓ నమ్మకస్తుడు ఉండాలనే భావనతో ఆయన్ను రాజ్యసభకు ఎంపిక చేసి పంపించారు. అయితే 2024 ఎన్నికల్లో తిరిగి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని ఆకాంక్షను వ్యక్తం చేసినా ఆనాడు సీఎంగా ఉన్న జగన్ అందుకు నిరాకరించారు. కనీసం తన సోదరుడికైనా టికెట్ ఇవ్వాలని పట్టుపట్టినా జగన్ అంగీకరించలేదు. ఎన్నికలకు ముందు రేపల్లెలో గణేష్ అభ్యర్థిత్వంలో పునరాలోచించాలని పలుమార్లు జగన్‌ను అభ్యర్థించారు. ఇదే విషయం మాట్లాడానికైతే మరోమారు తన వద్దకు రావద్దని అప్పటి సీఎం జగన్ ఎంపీ మోపిదేవికి చెప్పినట్లు, అదే విషయాన్ని తన అనుచరుల వద్ద చెప్పి ఎంపీ ఆవేదన వ్యక్తం చేసినట్లు ప్రచారం జరిగింది. ఇదంతా ఒక ఎత్తయితే జిల్లా వైసీపీ అధ్యక్ష పగ్గాలు అప్పచెప్పి సీట్ల ఖరారు విషయంలో నామమాత్రంగా కూడా తన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకపోవడాన్ని అవమానంగా మోపిదేవి భావించారు. దీనికి తోడు ఇష్టంలేని వ్యక్తికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడంతో అప్పటి నుంచి మోపిదేవి మనస్థాపానికి గురయ్యారు. ఎన్నికల ఫలితాల విడుదలయిన దగ్గర నుంచి ఎంపీ మోపిదేవి వైసీపీ పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉంటూనే వస్తున్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఆయన వైసీపీని వీడి టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. తద్వారా రాజ్యసభ సభ్యుడి పదవిని కూడా వదులుకునేందుకు ఆయన సిద్ధం కావడం విశేషం.

ఇసుక బుకింగ్ కౌంటర్లలో ఆన్‌లైన్

- 31వ తేదీ వరకు బుకింగ్ అయిన టోకెన్లు
- 780 టోకెన్లు.. అవి పూర్తి కాగానే మరుసటి రోజుకు స్లాట్



గుంటూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఇసుక బుకింగ్‌లో తలెత్తుతున్న సమస్యల నేపథ్యంలో అన్ని నియోజకవర్గాల కౌంటర్లను అనుసంధానిస్తూ ఆన్‌లైన్ విధానాన్ని జిల్లా యంత్రాంగం తీసుకొచ్చింది. దీని వల్ల టోకెన్ల జారీ కాస్తంత సులువైంది. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో బుకింగ్ కౌంటర్లు తెరవడంతో ఇసుక వినియోగదారుల వారికి సమీపంలో ఉన్న ఆఫీసులకు వెళ్లి స్లాట్ బుక్ చేసుకునే అవకాశం కలిగింది. మంగళవారం సాయంత్రం వరకు గుంటూరు ఆర్‌డీవో, తుళ్లూరు తహసీల్దార్ కార్యాలయాల్లో కనిపించిన రద్దీ బుధవారం ఉదయం నుంచి తగ్గిపోయింది. ఉదయం 6 గంటలకే బుకింగ్ ఆఫీసులు తెరుచుకోవడం, ఒక్కో వ్యక్తికి మూడు టోకెన్లు జారీతో రద్దీ తగ్గింది. అయితే ఈ నెల 31వ తేదీతో స్లాట్‌లు బుకింగ్ అయ్యాయి. దీంతో ఇసుక అవసరమైన వారు ఆ రోజు వరకు వేచి ఉండక తప్పదు. మంగళవారం సాయంత్రం వరకు జిల్లాలో గుంటూరు ఆర్‌డీవో, తాడేపల్లి, మంగళగిరి, తుళ్లూరు తహసీల్దార్ కార్యాలయాల్లో మాత్రమే ఇసుక బుకింగ్ టోకెన్లు జారీ చేశారు. అది కూడా మాన్యువల్ పద్ధతిలో. దీని వల్ల గందరగోళం నెలకొనడంతో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల హెడ్‌క్వార్టర్స్‌లోని తహసీల్దార్ కార్యాలయాల్లో బుకింగ్ ఆఫీసులు ఏర్పాటుకు కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు జారీ చేశారు. దీంతో కొంత వికేంద్రీకరణ జరగడంతో ఏ ప్రాంతానికి చెందిన లారీ యజమానులు అక్కడే బుకింగ్ చేసుకున్నారు. కాగా ఈ కేంద్రాలన్నింటిని ఆన్‌లైన్ విధానంలో అనుసంధానించారు. దీని వల్ల అన్ని చోట్ల కలిపి 780 టోకెన్లు జారీ కాగానే స్లాట్ మరుసటి రోజుకు ఆటోమేటిక్‌గా మారిపోతుంది. ఉదయం 6 మొదలు సాయంత్రం ఆరు గంటల వరకు కౌంటర్లు తెరిచి ఉంచడంతో రద్దీ తగ్గిపోయింది. ఒక్కో లారీ యజమాని /డ్రైవర్ మూడు చొప్పున ఆధార్‌లు, వాహన సీ బుక్‌లు తీసుకొచ్చి టన్నుకు రూ.250 వంతున 20 టన్నుల లారీకి రూ.5 వేలు ఆన్‌లైన్‌లో చెల్లించి టోకెన్లు తీసుకుని వెళ్లారు. దీనిపై కొంత విమర్శలు వ్యక్తమౌతున్నాయి. ఒక వ్యక్తికి ఒక టోకెన్ మాత్రమే జారీ చేయాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అలాంటప్పుడు ఒక లారీ యజమాని ఎవరెవరివో మూడు ఆధార్‌లు తీసుకొస్తే వాటికి టోకెన్లు జారీ చేయడంపై విమర్శలు వ్యక్తమౌతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం నుంచి ఒక లారీ డ్రైవర్/ యజమానికి ఒక టోకెన్ మాత్రమే జారీ చేసేలా చూడాల్సిన అవసరం ఉన్నది.

పోలవరంతో జలసిరులు కురిపించడమే లక్ష్యం


ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

గుంటూరు, ఆగస్టు 28: జాతీయ ప్రాజెక్టు, ఆంధ్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో చెల్లించాల్సిన బకాయిలతో పాటుగా, అవసరమైన నిధులను సమకూర్చి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు.. కేంద్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేయటంపై టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎంతో ముఖ్యమైన పోలవరం ప్రాజెక్టుకు మేలు చేస్తున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర జల శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు కృతజ్ఞతలు తెలిపారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి రాష్ట్రానికి జలసిరులు కురిపించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని తెలిపారు. ప్రాజెక్టును పూర్తి చేయాల్సిన ఆవశ్యకతపై ముఖ్యమంత్రి చంద్రబాబు అనేకమార్లు కేంద్ర ప్రభుత్వ పెద్దలకు విన్నవించారని గుర్తుచేశారు. కూటమి ఎంపీలు పార్లమెంట్‌లో ఈ ప్రాజెక్టు పూర్తి గురించి లేవనెత్తారని ఎంపీ పేర్కొన్నారు.

ముఖద్వారాన్ని ప్రారంభించిన మంత్రి లోకేశ్


శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి నారా లోకేశ్

మంగళగిరి సిటీ, ఆగస్టు 28: మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి సంబంధించి ఉత్తర వీధిలో నూతనంగా నిర్మించిన ముఖద్వారాన్ని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ బుధవారం ఉదయం ప్రారంభించారు. దాత తుల్లిమిల్లి రామకృష్ణ, శాంతి దంపతులు సుమారు రూ.35 లక్షలు వెచ్చించి ఈ ముఖద్వారాన్ని నిర్మించారు. మంత్రి నారా లోకేశ్ ఆర్చిని ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, దుగ్గిరాల మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు 1 వరకు సెలవు

తాడేపల్లి, ఆగస్టు 28: మంత్రి నారా లోకేశ్ ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ కార్యక్రమం ఈ నెల 29 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు నిర్వహించడం లేదని, తదుపరి తేదీలు ఒక రోజు ముందుగా తెలియజేస్తామని ప్రజలకు నారా లోకేశ్ కార్యాలయం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. అర్జీదారులు గమనించి సహకరించాలని కోరారు.

రాగులు ఇక స్టాక్ వస్తేనే..!

- ఈ నెల వరకు గుంటూరు, మంగళగిరి, తెనాలిలో పంపిణీ
- ఒక్కో కుటుంబం 3 కేజీల వరకు తీసుకోవచ్చు
- ఆ మేరకు బియ్యాన్ని మినహాయిస్తారు
- కార్డుదారులందరికీ చక్కెర పంపిణీ పునరుద్ధరణ



గుంటూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల్లో సేకరించిన రాగులలో సుమారు 96 టన్నులను పౌరసరఫరాల సంస్థ జిల్లాకు కేటాయించింది. ఈ స్టాకు జిల్లాలోని రేషన్‌కార్డుదారులందరికీ సరిపోయే పరిస్థితి లేకపోవడంతో రాగులు ఎక్కువగా వినియోగించే గుంటూరు, తెనాలి, మంగళగిరి అర్బన్ ప్రాంతాల్లోని కార్డుదారులకు పంపిణీ చేయాలని ఆ శాఖ నిర్ణయించింది. అది కూడా ఒక్కో షాపునకు 200 కేజీలు మాత్రమే ఇచ్చారు. దీనిని పరిగణనలోకి తీసుకొంటే ఆ షాపు పరిధిలో 100 మంది కార్డుదారులకు పంపిణీ చేసే నిల్వలు మాత్రమే ఉన్నాయి. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు ఒక్కో కుటుంబానికి 3 కేజీల చొప్పున రాగులు కోరుకొన్న వారికి ఇచ్చి ఆమేరకు బియ్యాన్ని మినహాయిస్తారు. వచ్చే నెల ప్రభుత్వం నుంచి స్టాకు వస్తే దీనిని కొనసాగిస్తామని పౌరసరఫరాల శాఖ అధికారి కోమలి పద్మ తెలిపారు.

వైసీపీ హయాంలో గాడి తప్పింది..

వైసీపీ ప్రభుత్వ హయాంలో పౌరసరఫరాల వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. అంతకుముందు వరకు ప్రతీ నెలా బియ్యంతోపాటు కందిపప్పు, పంచదార తప్పనిసరిగా పంపిణీ చేసేవారు. పలు సందర్భాల్లో గోధుమలు, గోధుమ పిండి, పామాయిల్ వంటివి కూడా సరఫరా చేసి పేదలకు అండగా నిలిచేశారు. ఇక పండగల సమయంలో మరిన్ని సరుకులు ఇచ్చేవారు. ఒకానొక దశలో రేషన్ షాపులను చంద్రన్న మాల్స్‌గా కూడా మార్పు చేసి అన్నిరకాల సరుకులు సరసమైన ధరలకే లభ్యమయ్యేలా చేయాలని భావించారు. ఎప్పుడైతే వైసీపీ అధికారంలోకి వచ్చిందో అప్పటి నుంచి పౌరసరఫరాల వ్యవస్థ నీరుగారిపోయింది. సన్నబియ్యం, డోర్ డెలివరీ మాట దేవుడెరుగు. అప్పటి వరకు ఇచ్చిన సరుకులను ఒక్కొక్కటిగా కోత పెడుతూ వచ్చి చివరికి బియ్యం పంపిణీకి మాత్రమే ఈ వ్యవస్థని పరిమితం చేసింది.

సెప్టెంబర్ నుంచి చక్కెర..

టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మళ్లీ పౌరసరఫరాల వ్యవస్థని గాడిన పెట్టే పనికి శ్రీకారం చుట్టింది. ఎండీయూ ఆపరేటర్ల వలన ఎలాంటి ఉపయోగం లేకపోతుండటంతో ఆ వ్యవస్థ రద్దు దిశగా చర్యలు చేపడుతున్నది. అలానే ఎన్నో నెలల నుంచి పంపిణీ చేయకుండా నిలిపేసిన చక్కెరని సెప్టెంబరు నెల నుంచి కార్డుదారులకు ఇచ్చేందుకు అవసరమైన స్టాకుని సమృద్ధిగా తెప్పించారు. అలానే రాయలసీమ జిల్లాల్లో మిగిలిపోయిన రాగుల స్టాకును కూడా తెప్పించి పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

దివ్యక్షేత్రంగా వైకుంఠపురం అభివృద్ధి

- సంప్రోక్షణ పూజల్లో మంత్రి మనోహర్


ఆలయ శిఖరంపై పవిత్ర జలాలు సమర్పిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి అర్బన్, ఆగస్టు 28: వైకుంఠపురం ఆలయాన్ని దివ్యక్షేత్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. శ్రీలక్ష్మీపద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహాసంప్రోక్షణ పూజల్లో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఆలయంలో నిర్మించిన గోపురాలు, శిఖర ప్రతిష్ఠ, జీవధ్వజ శిఖర ప్రతిష్ఠ, హోమాల కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. మంత్రికి తొలుత పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం గోపుర శిఖర కలశాలపై పూజలు, హోమంలో పూర్ణాహుతి, మహాదాశీర్వచనం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు చేయూత అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అవసరమైన నిధులు ఏర్పాటు చేసి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కేంద్రంలో కూడా మంత్రిగా ఈ ప్రాంత వాసి పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారని, వారి సహకారంతో పాటు రాష్ట్ర దేవాదాయ శాఖ నుంచి కూడా నిధులను తెచ్చి ఆలయాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. తెనాలి ప్రాంతానికి పూర్వ వైభవం వచ్చేలా అన్నివర్గాలు సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈవో తిమ్మానాయుడు, డీఎస్పీ జనార్ధన్, ట్రస్టుబోర్డు చైర్మన్ కె.సాయిబాబు, కమిటీ సభ్యులు, అర్చకులు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రేంజ్ పరిధిలో ఐదుగురు సీఐలకు పోస్టింగ్స్

గుంటూరు, ఆగస్టు 28 : రేంజ్ పరిధిలో ఐదుగురు సీఐలకు పోస్టింగ్స్ ఇస్తూ రేంజ్ ఐజీ ఎస్ ఎస్ త్రిపాఠి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన ఆయా సీఐల వివరాలు ఇలా ఉన్నాయి. బాపట్ల డీటీసీలో ఉన్న సీహెచ్ సింగయ్యను గుంటూరు వెస్ట్ ట్రాఫిక్ సీఐగా నియమించారు. ఏసీబీలో ఉన్న బి .రవీంద్రబాబును ఫిరంగిపురం సీఐగా నియమించారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న పి.భాస్కర్‌ను గురజాల సీఐగా నియమించారు. కృష్ణపట్నం పోర్టు సీఐ కె.వెంకటరెడ్డిని నెల్లూరు సౌత్ ట్రాఫిక్ సీఐగా నియమించారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న కె.రామకృష్ణను నెల్లూరు నార్త్ ట్రాఫిక్ సీఐగా నియమించారు.

అమ్మవారికి బంగారు వడ్డాణం బహూకరణ


ఆలయ కమిటీ సభ్యులకు అందజేస్తున్న వడ్డాణం

కారంపూడి, ఆగస్టు 28: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఓ కుటుంబం రూ.30 లక్షలు విలువ చేసే వజ్రాలతో పొదిగిన బంగారు వడ్డాణాన్ని కానుకగా సమర్పించారు. కారంపూడికి చెందిన సాయి బాలాజీ జ్యూవెలరీస్ ప్రొప్రైయిటర్ యేచూరి సత్యనారాయణ, విజయలక్ష్మి దంపతులు, వారి కుమారుడు శ్రీగోల్డ్ డైమండ్స్ ఎండీ యేచూరి మణిదీప్, స్పందన దంపతులు, వారి కుమార్తెలు ఈషా, అక్షశ్రీలు కుటుంబ సమేతంగా బుధవారం అమ్మవారి ఆలయానికి వచ్చారు. వారు తయారు చేయించిన బంగారు వడ్డాణాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ముందుగా ఆ కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజారి మణికంఠ ప్రత్యేక పూజలు జరిపారు. దేవస్థాన అధ్యక్షుడు చీతిరాల వెంకట కోటేశ్వరరావు, ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసుల్లో జైలు శిక్ష

మంగళగిరి, ఆగస్టు 28: రెండు వేర్వేరు చెల్లని చెక్కు కేసులకు సంబంధించి నిందితులకు జైలు శిక్ష, కాంపెన్‌సేషన్ చెల్లించాలని ఆదేశిస్తూ మంగళగిరి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె సురేష్‌బాబు బుధవారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి.

రైతును మోసగించిన కేసులో...

మంగళగిరిలోని కొండపనేని టవర్స్‌లో ఉంటున్న నాగళ్ల రవీంద్రబాబు అనే రైతు నుంచి భట్టిప్రోలుకు చెందిన అక్షయ ఫర్టిలైజర్స్ ప్రొప్రైయిటర్ మాదల ప్రవీణ్‌రాజు వ్యాపారం నిమిత్తం 1830 కిలోల మొక్కజొన్నను రూ.6,10,400లకు 2021లో కొనుగోలు చేశారు. అనంతరం పార్ట్ పేమెంట్ కింద రూ.5,80,000లకు చెక్కు ఇవ్వగా, సదరు చెక్కును ఫిర్యాది రవీంద్రబాబు మంగళగిరిలోని ఐసీఐసీఐ బ్యాంకులో వేయగా చెక్ బౌన్సు అయింది. అనంతరం రవీంద్రబాబు మంగళగిరి కోర్టులో ప్రవీణ్‌రాజుపై ఎన్ఐ యాక్టు కింద కేసు దాఖలు చేయగా వాదోపవాదాల అనంతరం నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ.5,80,000లు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సురేష్‌బాబు తీర్పు చెప్పారు.

మరో కేసులో..

మంగళగిరి మండలం నూతక్కి గ్రామానికి చెందిన అవుతు శ్రీనివాసరెడ్డి నుంచి వలివేరుకు చెందిన బి.అరుణారెడ్డి 2018లో రూ.3 లక్షలు నగదు తీసుకుని పార్ట్ పేమెంట్ కింద రూ.3 లక్షలకు చెక్కు ఇవ్వగా, ఫిర్యాది ఆ చెక్కును నూతక్కి బ్యాంక్ ఆఫ్ ఇండియాలో వేయగా బౌన్సు అయింది. శ్రీనివాసరెడ్డి మంగళగిరి కోర్టులో అరుణారెడ్డిపై ఎన్ఐ యాక్ట్ కింద కేసు దాఖలు చేయగా వాదోపవాదాల అనంతరం నిందితురాలికి ఆర్నెల్లు జైలు శిక్ష, రూ.3 లక్షలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సురేష్‌బాబు తీర్పు చెప్పారు.

దారి దోపిడీ కేసులో నిందితుడి అరెస్టు

పెదకాకాని, ఆగస్టు 28: హైవేపై దారి దోపిడీకి పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు బుధవారం పెదకాకాని పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం గుంటూరు నగరం పట్టాభిపురం సమీపంలోని ఫాతిమానగర్‌కు చెందిన సుబ్రహ్మణ్యం కార్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వచ్చే జీతం చాలక దారి దోపిడీలకు పాల్పడుతూ ఉన్నాడు. ఈ క్రమంలో తక్కెళ్లపాడు బైపాస్ వద్ద హైవేపై రెండు పర్యాయాలు ద్విచక్ర వాహనదారులను బెదిరించి ఒకరి వద్ద రూ.లక్ష, మరొకరి వద్ద రూ.4 లక్షలు దోపిడీ చేశాడు. అదేవిధంగా పెదకాకాని సమీపంలోని శివారు ప్రాంతాల్లో ఒక వ్యక్తిని బెదిరించి రూ 6,700 దోచుకున్నాడు. మూడు కేసుల్లో నిందితుడైన సుబ్రహ్మణ్యాన్ని కోర్టుకు హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

నలుగురు బైకు దొంగల అరెస్టు

చిలకలూరిపేట, ఆగస్టు 28: చిలకలూరిపేట, నరసరావుపేటలలో బైక్ దొంగతనాలకు పాల్పడిన చిలకలూరిపేటకు చెందిన నలుగురు యువకులను చిలకలూరిపేట అర్బన్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. స్థానిక వైయస్సార్ కాలనీ ప్రాంతంలో అరెస్టు చేసిన వారి వద్ద నుంచి ఐదు బైకులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో జూపూడి రాజేష్ (సాంబశివనగర్), షేక్ అబ్దుల్ బాషా (మదర్ థెరిస్సా కాలనీ), పాలడుగు నాగేశ్వరరావు (మదర్ థెరిస్సా కాలనీ), దాసరి వెంకటేశ్వర్లు (మదర్ థెరిస్సా కాలనీ) ఉన్నారు. అర్బన్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో అర్బన్ ఎస్ఐ డి.చెన్నకేశవులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను రిమాండ్‌కు పంపారు.

12వ వేతన సవరణ కమిషన్‌ను నియమించాలి

- ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు చాంద్ బాష



మాట్లాడుతున్న చాంద్ బాషా, పక్కన ఉద్యోగ సంఘ నాయకులు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 28: ప్రభుత్వ ఉద్యోగులకు 12వ వేతన సవరణ కమిషన్‌ను నియమించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు చాంద్ బాష కోరారు. బుధవారం సంఘ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11వ వేతన సవరణ ముగిసి 14 నెలలు గడచినా 12వ వేతన సవరణ కమిషన్‌ను ఏర్పాటు చేయకపోవటం దురదృష్టకరమన్నారు. కమిటీని నియమించలేని పక్షంలో 29 శాతం మధ్యంతర భృతి ప్రకటన చేయాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులు 14 నెలలు నష్టపోయారని, ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని వేతన సవరణ కమిషన్‌ను తక్షణమే నియమించాలని కోరారు. సమావేశంలో సంఘ సభ్యులు కరీముల్లా షాఖాదరి, నాగేశ్వరరావు, పెద రత్తయ్య, రాజబాబు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు

చంద్రబాబు.. పవన్ పర్యటన ఇలా..

- నరసరావుపేట జేఎన్‌టీయూలో భారీగా ఏర్పాట్లు

నరసరావుపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవణ్ కళ్యాణ్ నరసరావుపేట పర్యటనకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. నరసరావుపేట మండలంలోని కాకాని వద్ద ఉన్న జేఎన్‌టీయూ కళాశాల ప్రాంగణంలో 30న జరగనున్న వనమహోత్సవంలో చంద్రబాబు, పవన్ పాల్గొననున్నారు. శుక్రవారం ఉదయం 10.10 గంటలకు ఉండవల్లి నుంచి హెలిక్యాప్టర్‌లో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ బయలుదేరుతారు. 10.30 గంటలకు జేఎన్‌టీయూ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు వస్తారు. 10.45 గంటలకు వనమహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటుతారు. అనంతరం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ బహిరంగ సభలో ప్రసంగిస్తారు. 12.45 గంటలకు బహిరంగ సభ ముగుస్తుంది. 12.50 గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకొని ఉండవల్లి బయలుదేరి వెళ్తారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ సూరజ్ పర్యవేక్షించారు. బహిరంగ సభ ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి.

18 క్రస్ట్ గేట్ల ద్వారా నీరు విడుదల


నాగార్జున సాగర్ నుంచి విడుదల అవుతున్న నీరు

మాచర్ల రూరల్, ఆగస్టు 28: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ 18 క్రస్ట్ గేట్ల ద్వారా బుధవారం అధికారులు నీటిని విడుదల చేశారు. 18 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 1,45,800 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కాగా నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం 590.00 అడుగులు ఉంది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,330 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8,280 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,948 క్యూసెక్కులు, 18 క్రస్ట్ గేట్ల ద్వారా 1,45,800 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1,94,788 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 1,94,758 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

ప్రకాశం బ్యారేజి దిగువకు 36,500 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 28: ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుంచి 53,520 క్యూసెక్కుల వరద నీరు బుధవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ అజముద్దీన్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 50 గేట్లను 1 అడుగు వంతున ఎత్తి దిగువకు 17,020 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 17,020 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

1.0321 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల, ఆగస్టు 28: నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ 9 క్రస్ట్‌గేట్లను 2.5 మీటర్ల ఎత్తి పులిచింతలకు 1,23,470 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు, ఇందులో క్రస్ట్ గేట్ల ద్వారా 1,15,317, టేల్ రేస్ ఛానల్ ద్వారా 8,153 క్యూసెక్కుల నీటిని పంపుతున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ చెప్పారు. ఎగువన ఉన్న సాగర్ నుంచి 1,24,000క్యూసెక్కుల నీరొస్తుందన్నారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.0321 ఎంయూల విద్యుత్ తయారైందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 7.011 టీఎంసీల నీరుండగా ఈ నీరు 75.40 మీటర్లకు సమానమన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 28: పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 65,878 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 88,818 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుండగా, దీనిలో 16 వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా దిగువకు విడుదల అవుతుందని తెలిపారు.

బలవంతపు మత మార్పిడి చేసే వారిని శిక్షించాలి


డాక్టర్ జోసఫ్ మోసిగంటి

పొన్నూరుటౌన్, ఆగస్టు28: బలవంతపు మత మార్పిడిలు చేసే వారిని కఠినంగా శిక్షించాలని జీసెస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ జోసఫ్ మోసిగంటి ప్రభుత్వాని బుధవారం కోరారు. స్థానికంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో మత మార్పిడిలు ఎక్కువ జరిగాయని విమర్శించారు. పదవుల కోసం మతం మారిన వారిని కూడా కఠినంగా శిక్షించాలన్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో ఆధ్యాత్మికతను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. బలవంతపు మత మార్పిడిలు పాస్టర్లు కానీ, క్రైస్తవులు కానీ చేయరన్నారు. బైబుల్ ప్రకారం మత ప్రచారం మాత్రమే చేయాలని మార్పిడి చేయకూడదన్నారు. రాజకీయ క్రైస్తవ నామినేటెడ్ పదవుల కోసం బలవంతపు మత మార్పిడిలు జరిగాయనేది వాస్తవం అన్నారు. రాష్ట్రంలో మైనార్టీలకు 800 నామినేటెడ్ పదవులు ఉండగా అధిక భాగం ముస్లింలకు కేటాయించారని అన్నారు. మిగిలిన వాటిలో ఎక్కువగా క్రైస్తవేతరులను క్రైస్తవులుగా మార్చి ఆ కోటాలో పదవులు ఇచ్చారని ఆరోపించారు. ఈ విషయాన్ని గత ప్రభుత్వంలో అందరి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆరోపించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

54,615 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 57,286 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 54,615 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 20,873 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8000	16000	334	9000	15000
నెంబరు. 5	9100	13000	నెంబరు. 5	11000	11000
273	11200	13000	273	12500	12500
341	8000	15000	341	9000	13000
4884	8000	15000	4884	11000	15700
సూపర్ 10	10000	11600	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	18500	తేజ	8000	18600
బ్యాడిగి	8000	17000	బ్యాడిగి	10000	16000
దేవనూరు డీలక్స్	9000	13500	దేవనూరు డీలక్స్	10000	14000
తెల్లకాయలు	4500	12000	తెల్లకాయలు	5000	11000

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



కలెక్టరేట్ ఎదుట రిలే నిరసన దీక్షలో పాల్గొన్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

మెస్, కాస్మోటిక్ చార్జీలను తక్షణమే విడుదల చేయాలి

● ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్‌బాబు

● కలెక్టరేట్ ఎదుట రిలే నిరసన దీక్ష

గుంటూరు (తూర్పు), ఆగస్టు 28: రాష్ట్ర వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో గుంటూరు కలెక్టరేట్ ఎదుట రిలే నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సాంఘీక సంక్షేమ వసతి గ్రహాల్లో చదువుతున్న విద్యార్థులకు ఏడేళ్ల నుంచి ట్రంకు పెట్టెలు, దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు పూర్తిస్థాయిలో అందలేదన్నారు. 2023 నవంబరు నుంచి మెస్, కాస్మోటిక్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయలేదని గుర్తుచేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ మాట్లాడుతూ నగరంలో ఉన్న కోడిగుడ్డు సత్రం నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో నిరసనకు సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మద్దతు తెలపగా, నిరసనల్లో జంగాల చైతన్య, షేక్ కరీం, తిరుమలరావు, యశ్వంత్, కిరణ్, నవ్యశ్రీ. శివ, అభి, దుర్గా సాయి తదితరులు పాల్గొన్నారు.



పురస్కార గ్రహీతలతో నిర్వాహకులు

ఘనంగా వాగ్దేవి పురస్కార ప్రదానం

గుంటూరు(తూర్పు), ఆగస్టు 28: స్థానిక బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై రామరాజు ఫౌండేషన్, జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగుభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం విశిష్ట వ్యక్తులకు వాగ్దేవి పురస్కార ప్రదానోత్సవ సభ జరిగింది. సభకు రామరాజు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, అతిథులుగా టీడీపీ నాయకులు మన్నవ సుబ్బారావు, రంగస్థల నటుడు రచయిత డాక్టర్ నరాలశెట్టి రవికుమార్, ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, ప్రభుత్వ టెక్స్టుబుక్ ప్రింటింగ్ ప్రెస్ డిప్యూటీ డైరక్టర్ డి.రవికుమార్, రవాణాశాఖ అధికారి బి.మధుసూధనరావు తదితరులు పాల్గొని జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ చైర్మన్ గుదిబండి వెంకటరెడ్డి సంకలనం చేసిన కుటుంబం కవితా సంపుటిని అతిథులు ఆవిష్కరించారు. ప్రముఖ రంగస్థల నటుడు దర్శకుడు నూతలపాటి సాంబయ్య కవితా సంపుటికి స్వీకర్తగా వ్యవహరించారు. వయోలిన్ విద్వాంసులు పి.నందకుమార్, రంగస్థల నటి ఎం సాయిప్రియ, సబ్ ట్రెజరీ అధికారి జిత్తు మల్లికార్జునరావులను వాగ్దేవి పురస్కారంతో ఘనంగా సత్కరించారు. సభానంతరం పలువురు దివ్యాంగ కళాకారులు నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకులను ఆకట్టుకుంది. కార్యక్రమాన్ని డి.తిరుమలేశ్వరరావు, సయ్యద్ జానీ బాషా, జి.మల్లికార్జునరావులు పర్యవేక్షించారు.

వైభవంగా భగవాన్ ధన్వంతరి విగ్రహ ప్రతిష్ఠ

గుంటూరు(మెడికల్), ఆగస్టు 28: భగవాన్ ధన్వంతరి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. బుధవారం ఉదయం తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద 100కు పైగా పడకలు కలిగిన ఆయుర్వేదిక్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అయిన భాష్యం రామసేతు క్యాంపస్ వెనక ఉన్న శ్రీవేంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్‌లో డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. అనంతరం దీక్షా హోమం, మహాపూర్ణాకృతి కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమాన్ని బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, విశిష్ట అతిథులు మహమ్మద్ నసీర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



ధన్వంతరి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు

సీటీ శాఖలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియను వాయిదా వేయాలి

గుంటూరు, ఆగస్టు 28: వాణిజ్యపన్నులశాఖ ఉద్యోగుల బదిలీల ప్రక్రియను వాయిదా వేయాలని ఏపీ సీటీ, సర్వీసెస్ అసోసియేషన్ గుంటూరు-1, 2 డివిజన్ల అధ్యక్షులు ఎస్ఎస్ఎస్ ప్రసాద్, ఏఎస్ సోమశేఖరరావులు డిమాండ్ చేశారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు రెండు డివిజన్‌లలో అసోసియేషన్‌కు చెందిన ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సంస్కరణల పేరుతో ఏర్పాటు చేసిన రీజనల్ కార్యాలయాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధంగా గతంలో జరిగిన ఉద్యోగుల బదిలీలను రద్దు చేసి, విచారణ జరపాలన్నారు. సిటీ శాఖలో కొందరు ఉన్నతాధికారుల అవినీతిపై ఏసీబీతో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సీటీ శాఖలో పునర్వవస్థీకరణ పేరుతో జరిగిన అరాచకంపై దర్యాప్తు చేయాలన్నారు. ప్రభుత్వం విచారణ జరిపే వరకు బదిలీల ప్రక్రియను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 'సరస్వతి'

● ఆదర్శంగా కొరిటెపాడులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

● పనుల నిమిత్తం వచ్చే వారికి సౌకర్యాలు

● అందుబాటులో తెలుగు సాహిత్యం

● వందలాది పుస్తకాలు, రవివర్మ చిత్రాలు

● దాతల సహకారంతో కార్పొరేట్ తరహా సేవలు





అందుబాటులో ఉంచిన తెలుగు సాహిత్య పుస్తకాలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 27: చిన్నపాటి శబ్దంతో తిరిగి తిరగని ఫ్యాను.. తాగడానికి పాత కుండలో నీరు....పై కప్పు నుంచి పడే పెచ్చులు....విరగడానికి సిద్ధంగా ఉండే కుర్చీలు...అప్పుడప్పుడు ఆన్‌లైన్ సేవల్లో అంతరాయం...కార్యాలయానికి వచ్చే వారిపై అధికారుల ఆగ్రహం...వీటితో పాటు జనంపై క్లర్క్‌గారి రుసరుసలు....ఇవన్నీ ప్రభుత్వ కార్యాలయమంటే సామాన్యుడికి గుర్తుకొచ్చే విషయాలు. వీటితో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో తమ పని ఎప్పుడు పూర్తవుతుందో, ఎవర్ని అడగాలో తెలియని సందేహాలు సరేసరి. ఇవన్నీ బోనస్‌లుగా భావిస్తుంటారు. అయితే, గుంటూరులోని కొరిటెపాడులో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మాత్రం ఇందుకు భిన్నం. ప్రభుత్వంతో పాటు పబ్లిక్, ప్రైవేటు, ప్రజల భాగస్వామం(పీ-4)తో రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనను ఈ కార్యాలయం నిజం చేస్తోంది. పన్నుల రూపంలో పోషిస్తున్న ప్రజలకు చిన్నపాటి అసౌకర్యం లేకుండా అక్కడి అధికారులు అహర్నిశలు కష్టపడుతున్నారు. పనుల నిమిత్తం ఈ కార్యాలయానికి వచ్చే వారికి మినరల్ వాటర్ బాటిల్, ఆ రోజు జరిగే రిజిస్ట్రేషన్ వివరాలు, సమయం తెలిపే బోర్డులు, ఏసీ సౌకర్యం, కూర్చోవడానికి నాణ్యమైన కుర్చీలు, రాసుకోవడానికి రీడింగ్ టేబుల్స్ వంటివి ఆ కార్యాలయంలో దర్శనమిస్తాయి.

ఎల్‌విఆర్ క్లబ్ నుంచి గోరంట్ల, శ్రీ వేంకటేశ్వర దేవాలయం మధ్య ఉన్న స్థల క్రయ, విక్రయాలన్నీ ఈ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనే జరుగుతాయి. రోజుకు సరాసరి 30 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. రిజిస్ట్రేషన్లకు సంబంధించి రోజుకు సుమారు 150 మంది వరకు వస్తుంటారు. వీటితో పాటు పెళ్లికు సంబంధించిన రిజిస్ట్రేషన్లు కూడా జరుగుతుంటాయి. ఇదంతా కాదు కానీ.. ఆ కార్యాలయం గురించి విశేషంగా చెప్పుకునే మరోవిషయం పుస్తకాలు. ఆ కార్యాలయం లోపలికి అడుగుపెట్టే వారికి ఇది గ్రంథాలయమా లేక రిజిస్ట్రేషన్ కార్యాలయమా అనే సందేహం కలుగుతుంది. ఎందుకంటే, కార్యాలయం నిండా పుస్తకాలే దర్శనమిస్తా యి. ఒక విధంగా అక్కడి పుస్తకాలు మనకి ఆహ్వానం పలికేలా ఉంటాయి.

తెలుగు సాహిత్యం... పెయింటింగ్‌లు

ప్రతి అధికారి టేబుల్‌పైనా పుస్తకాలను ఉంచుతారు. గోపిచంద్ రచించిన 'అసమర్థుని జీవ యాత్ర', మహిళా హక్కుల కార్యకర్త మలాల యూసఫ్ రచించిన పుస్తకాలు, వివేకానంద రచనలు, వ్యక్తిగత వికాస నిపుణుడు పట్టాభిరామ్ పుస్తకాలు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై రచనలు, కవి కాళోజీ 'నా గొడవ' కవితలతో పాటు అనేక మంది తెలుగు సాహిత్య రచయితలు రచించిన దాదాపు 200 పుస్తకాలు అందుబాటులో ఉంటాయి. ముఖ్యంగా రిజిస్ట్రేషన్ చట్టం, భూమి హక్కుదారుడి హక్కులపై తెలిపే పుస్తకాలను అందుబాటులో ఉంచారు. వీటితో పాటు ప్రముఖ చిత్రకారుడు రవివర్మ చిత్రాలు, మహనీయుల విగ్రహాలను ప్రదర్శనగా ఉంచారు. యాంత్రిక జీవితంలో మొబైల్ ఫోన్లుకే అతుక్కుపోతున్న తరుణంలో ప్రతి ఒక్కరికి పుస్తకాన్ని అలవాటు చేయాలనే ప్రయత్నంలో భాగంగా తెలుగు సాహిత్యాన్ని అందుబాటులో ఉంచామని, కనీసం కాసేపు అయినా ఫోను పక్కన బెట్టి పుస్తకాన్ని చదువుతారని కార్యాలయ సిబ్బంది చెప్పడం విశేషం.

దాతల సహకారం..

ప్రభుత్వ కార్యాలయాల అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేయాలనే ఆలోచనను ప్రజలతో అక్కడి అధికారులు పంచుకున్నారు. ప్రముఖ సంస్థలు భాష్యం విద్యాసంస్థలు, పయినీర్ సంస్థ, భ్రమర టౌన్‌షిప్, భ్రమరాంబ, యాగంటి, జ్యోతిర్మయి సంస్థలతో పాటు ఇతర దాతలు ఫర్నిచర్, ఇతర సౌకర్యాలను సమకూరుస్తున్నారు. వీరితో పాటు రిజిస్ట్రేషన్ పూర్తయిన వారు కొంతమంది కార్యాలయానికి ఒక పుస్తకం చొప్పున బహూకరిస్తున్నారు. ప్రముఖ రచయిత కందేపి రాణీ ప్రసాదు, బొమ్మిడాల కృష్ణమూర్తి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాదు వంటి వారు పుస్తకాలను అందిస్తున్నారు.

పన్నులు కట్టే వారికి కనీస మర్యాదలు అవసరం

గుడ్ గవర్నన్స్ కోసం ప్రజల భాగస్వామ్యం అవసరమనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనలను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నాం. పన్నులు కట్టే వారికి కనీస మర్యాదలు అవసరమని భావనతో ఈ కార్యక్రమాన్ని రూపొందించాం. వీటితో పాటు మొబైల్ ఫోన్ బానిసత్వాన్ని వదిలేలా కృషి చేస్తున్నాం. అందుకే మరిచిపోయిన పుస్తకం పఠనాన్ని తిరిగి అలవాటు చేసే ప్రయత్నం చేస్తున్నాం. ముఖ్యంగా 'తెలుగు భాషతోనే సమాజాన్ని నిర్మిద్దాం, తెలుగు భాషకే పట్టం కడదాం' అనే గిడుగు వెంకట రామ్మూర్తి మాటలను గుర్తుపెట్టుకుని తెలుగు సాహిత్యాన్ని అందుబాటులో ఉంచాం. సదుపాయాలు, సౌకర్యాలు సమకూర్చిన దాతలకు కృతజ్ఞతలు తెలుపుతున్నాం. **- ఎం.ఆదినారాయణ, సబ్ రిజిస్ట్రార్, కొరిటెపాడు.**



గోడకు తగిలించిన రవివర్మ చిత్రాలు



కార్యాలయానికి వచ్చే వారి కోసం ఏర్పాటు చేసిన కుర్చీలు



సబ్ రిజిస్ట్రార్ ఆదినారాయణకు పుస్తకాన్ని బహూకరిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాదు

మానవ సేవే మాధవ సేవ : ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మానవ సేవే మాధవ సేవ అని భావించి నిస్వార్థంగా సేవలు అందించాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పిలుపునిచ్చారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో బుధవారం జరిగిన పలు కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. తొలుత 43వ డివిజన్ విద్యానగర్‌లో జరిగిన దేవస్థాన ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం 34వ డివిజన్ దేవాపురంలోని పోలేరమ్మ దేవస్థానం నందు కొలుపులు కార్యక్రమంలో పాల్గొన్నారు. 29వ డివిజన్ శ్మశాన వాటి క వద్ద రుద్ర చారిటబుల్ ట్రస్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో పేదలకు సేవ చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

కొరిటెపాడు ట్రాక్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

కొరిటెపాడు ట్యాంక్‌బండ్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి గళ్లా మాధవి హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కమిటీ ప్రెసిడెంట్‌గా కన్నసాని బాజీతో పాటు ఇమడాబత్తిన కోటేశ్వరరావు, సత్యనారాయణ, బెజవాడ శివరామకృష్ణ రెడ్డి, అన్నం గంగాధర్, ఓబులరెడ్డి, లేళ్ళ రత్తయ్య, గళ్లా గురుపాదం, రవీంద్ర, విష్ణువర్ధన్, రామకృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులతో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమములో జనసేన రాష్ట్ర కార్యదర్శి బొనబోయిన శ్రీనివాసరావు, గోరంట్ల మాజీ సర్పంచ్ కందుల సుబ్బారావు, వెంకయ్య, సింగంశెట్టి కోటేశ్వరరావు, దాసరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేసిన నూతన కమిటీ సభ్యులతో గళ్లా మాధవి, బోనబోయిన

వీధి వ్యాపారులకు ప్రత్యేక జోన్లు

● అనువైన ప్రదేశాల గుర్తింపునకు 3 కమిటీల ఏర్పాటు

● నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

● కమిషనర్ పులి శ్రీనివాసులు



పులి శ్రీనివాసులు

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 28 : గుంటూరు నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యల్లో భాగంగా వీధి వ్యాపారులకు ప్రత్యేక జోన్ల ఏర్పాటు చేయనున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఈ విషయాన్ని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకుగాను అనువైన స్థలాల గుర్తింపునకు నగరపాలక సంస్థ, అదనపు కమిషనర్, సిటి ప్లానర్, సూపరిండెంట్ ఇంజనీర్ల ఆధ్వర్యంలో మూడు కమిటీలను ఏర్పాటు చేశామని, వీధి వ్యాపారులు కూడా అయా జోన్లకు వెళ్లేందుకు సమాయత్తం కావాలని పేర్కొన్నారు. నగరంలో పెరుగుతున్న జనాభాతో పాటు వాహనాల ట్రాఫిక్ కూడా పెరుగుతుండటంతో, ప్రధాన రహదా రులను విస్తరించినప్పటికీ వీధి వ్యాపారుల ఆక్రమణల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. రోడ్ మార్జిన్‌లు, ఫుట్ పాత్‌ల ఆక్రమణలకు గురవుతుండటంతో వాహనాలు, అత్యవసర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి వస్తుందన్నారు. నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య సిబ్బంది పలుమార్లు ఆక్రమణదారులకు సంబంధిత సమస్య గురించి తెలియజేసినా ఎటువంటి సహకారం లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో సంబంధిత సమస్య శాశ్వత పరిష్కారం కోసం స్ట్రీట్ వెండింగ్ పాలసీ అమలుకు నగరంలో రెడ్, అంబర్, గ్రీన్ జోన్ల ఏర్పాటు కు తగిన స్థలాలను గుర్తించేం దుకు నగరపాలక సంస్థ సీనియర్ అధికారులతో కమిటీలను ఏర్పాటు చేశా మని తెలిపారు. జోన్ల ఏర్పా టుకు ముందు వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు అందిస్తామని, ఆయా జోన్లలోనే క్రయవిక్రయాలు నిర్వహించేలా వారు సహకరించా లని కోరారు. పట్టణ ప్రణాళిక అధికారులనుద్దేశించి కమిషనర్ మాట్లాడుతూ జోన్ల ఏర్పాటు అయ్యే వరకు నగరంలో ప్రధాన రోడ్లపై ట్రాఫిక్‌కు అడ్డుగా ఉన్న వీధి వ్యాపారు లకు ముందుగా తెలిపి, రోడ్ మార్జిన్ అతిక్రమించ కుండా చూడాలని, వీధి వ్యాపారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిం చాలన్నారు. జీఎంసీ సిబ్బంది వీధి వ్యాపారుల పట్ల అనుచితంగా ప్రవర్తించినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీధి వ్యాపారులు కూడా నగరపాలక సంస్థ సిబ్బందికి సహకరించి నిబంధనలు పాటిస్తూ, వారి కార్యకలాపాలు నిర్వహించుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో సమస్య ఉత్పన్నమైన ఎడల నేరుగా తమ దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. జోన్ల ఏర్పాటు అయిన పిదప నిర్దేశిత ప్రాంతాలకు తరలివెళ్లేందుకు సమాయత్తం కావాలన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల క్వార్టర్స్‌లో సమస్యల తిష్ఠ

● ఈదర వీరయ్య

గుంటూరు, ఆగస్టు 28: జిల్లా పరిషత్, కలె క్టర్ ఆఫీసు ఎదురుగా ఉన్న ఉద్యోగుల నివాస సముదాయాల్లో సమస్యలు తిష్ఠ వేశాయని పెన్షన్‌దారుల చర్చా వేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏళ్ళ తరబడి గా జిల్లా పరిషత్ క్వార్టర్లలో కానీ, ఆర్ అండ్ బీ క్వార్టర్లలో కానీ ఎలాంటి అభివృద్ధి పనులు, కనీస సౌకర్యాలు లేక అక్కడ నివసిస్తున్న కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఇక్కడ నివసి స్తున్న ఉద్యోగులు హెచ్‌ఆర్‌ఏతో పాటు అదనంగా నెలకి నిర్వహణ ఖర్చుల కింద రూ.180 చెల్లిస్తున్నా రన్నారు. అయినా అందుకు తగిన సౌకర్యాలు కల్పించటంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. జీతంలో హెచ్‌ఆర్ఏ వసూలు చేస్తుండటంతో చాలీచాల ని వేతనాలతో వేరే చోట అద్దె ఇళ్లు తీసుకోలేక ఇక్కడే బిక్కుబిక్కుమం టూ కాలం వెళ్లదీస్తున్నారన్నారు. జడ్పీ సమీపంలో 15 ఎకరాల విస్తీర్ణం లో ఉన్న నివాస సముదాయంలో సరైన రక్షణ గోడలు లేక పందులు, పశువులకు నిలయాలుగా మారాయన్నారు. ఈ కాలనీల్లో ఉన్న స్థలాల్లో కొన్ని స్థలాలను ఆక్రమించుకొని కొందరు జీవనం గడుపుతున్నారన్నారు. కొందరు బడ్డీలు పెట్టుకొని ఉంటున్నారన్నారు. గతంలో ప్రభుత్వ ఉద్యో గులు 24 గంటలూ సేవకులనే భావనతో కలెక్టరేట్ ఎదురుగాను, జిల్లా పరిషత్ సమీపంలోనూ 60 ఏళ్ల క్రితం ఈ నివాస సముదాయాలు నిర్మించారన్నారు. కార్యాలయ పనులపై ఎప్పుడు అవసరమై పిలిచినా వచ్చేందుకు దగ్గరలో ఉంటారని ఈ క్వార్టర్స్ నిర్మించారన్నారు. ప్రభు త్వం వీటిని పూర్తిగా డిమాలిష్ చేసి ఐదంతస్తుల భవన సముదా యాలు నూతనంగా నిర్మిస్తే ప్రభుత్వం హెచ్‌ఆర్ఏ చెల్లించే పని లేకుం డా పోవడంతో పాటు కలెక్టర్ ప్రాంగణంలో పనిచేసే 50 కార్యాలయాల ఉద్యోగులందరికి గృహ వసతి కల్పించినట్లవుతుందన్నారు. ఈ దిశగా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించాలని వీరయ్య విజ్ఞప్తి చేశారు.

వైసీపీ హయాంలో అసైన్డ్ భూముల దందా : ధారూనాయక్

గుంటూరు, ఆగస్టు 28 : వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏ నిర్ణయం తీసుకున్నా దాని వెనుక ఏదో ఒక స్వప్రయోజనమో లేదా కుంభకోణం దాగి ఉన్నట్లేనని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారూనాయక్ బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులంటూ జగన్ ప్రభుత్వం తెచ్చిన ఉత్తర్వుల ఫలితంగా ఉత్తరాంధ్రలో వేల కోట్ల రూపాయల అసైన్డ్ భూములకు రెక్కలొచ్చాయని, ఈ కుంభకోణంలో అక్రమాలు ఒక్కొక్కటీ బయటి కొస్తున్నాయని తెలిపారు. నిషిద్ధ జాబితా (22) నుంచి తొలగించిన భూముల (ఫ్రీ హోల్డ్) వ్యవహారాల్లో నాడు జరిగిన అక్రమాలు వెలుగు చూస్తున్నట్లు పేర్కొన్నారు. ఇరవై ఏళ్లు దాటిన అసైన్డ్ భూములను నిషిద్ధ జాబితా నుంచి తప్పించే పేరుతో గడువు దాటని భూములకూ రెక్కలొచ్చినట్లు తెలుస్తోందని తెలిపారు. యాజమాన్య హక్కుల కల్పనకు సంబంధించిన జీవో 596 విడుదల కాకముందే ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతుల నుంచి అసైన్డ్ భూములు అగ్రిమెంట్ల పేరుతో గుప్పిట్లోకి తీసుకున్నారని, ఉత్తర్వులొచ్చిన కొన్ని రోజుల్లోనే రిజిస్ట్రేషన్‌లు జరిగిపోయాయని ఆరోపించారు. అసైన్డ్ భూములపై పేదలకు శాశ్వత హక్కులు (ఫ్రీ హోల్) కల్పిస్తూ జగన్ సర్కారు గతేడాది అక్టోబరు 27న చట్టం చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఉమ్మడి చిత్తూరు, ప్రకాశం, ఇతర జిల్లాల్లోనూ ఈ అక్రమాల భూదందా జరిగిందని ధారూనాయక్ ఆరోపించారు.

అన్ని రంగాల్లో మహిళల సత్తా : ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో తమ సత్తా చాటుతున్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ కొనియాడారు. గుంటూరు ఉమెన్స్ కళాశాలలో సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ ఎకనామిక్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 'మహిళల స్వీయ రక్షణ.' అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ నేడు దేశంలో ప్రభుత్వ అధినేతలు, కార్పొరేట్, వాణిజ్య, క్రీడా రంగాల్లో ఇలా అనేక రంగాల్లో మహిళలు ముందుకు సాగుతున్నారని ఆయన కొనియాడారు. అదే మార్గంలో నేటి యువతి పయనించాలని, విద్యార్థులు ప్రతి ఒక్కరూ తాము చేసే పనిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సోషల్ మీడియా ప్రభావాలకు లోను కాకుండా మంచి మార్గంలో నడవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లు మహిళలకు పెద్దపీట వేసే విధంగా 'మేక్ ఇన్ ఇండియా' తో సబ్సిడీ రుణాలతో వారి ఎదుగుదలకు తోడ్పడుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా రక్షణ కోసం టోల్ ఫ్రీ నంబర్లు 112, 1098లను అందుబాటులో వుంచినట్లు చెప్పారు. పోలీసు వ్యవస్థ చురుగ్గా పనిచేస్తూ ఆడబిడ్డ సంరక్షణే ధ్యేయంగా పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో దిశ డీఎస్పీ డీవీ సుబ్బారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జోత్స్నకుమారి, డాక్టర్ కే శ్రీవిద్య, షేక్ జిలాని, డాక్టర్ పి.విజయలక్ష్మి, ఖమర్ బేగం పాల్గొన్నారు.




సదస్సులో మాట్లాడుతున్న మొహమ్మద్ నసీర్

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

గుంటూరు తూర్పు నియోజకవర్గం డొంక రోడ్డులో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే నసీర్ బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుంటూరు తూర్పులో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ముప్పవరపు భారతి, సొపాటి రత్నం పాల్గొన్నారు.

అందుకే వైసీపీ డ్రామా : కనపర్తి



కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతల కామకలాపాల నుంచి దృష్టి మళ్లించేందుకే ఎన్నికల ఫలితాలపై ఆ పార్టీ డ్రామా ఆడుతోందని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు విమర్శించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ఫలితాల అనంతరం వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డితో సహా ఆ పార్టీ ముఖ్య నేతలందరికీ చిన్న మెదడు పూర్తిగా చితికి పోయిందని ఎద్దేవా చేశారు. ఫలితాలు ప్రకటించిన మూడు నెలల తర్వాత, ఎన్నికలు జరిగిన తీరుపై తమకు అనుమానాలు ఉన్నాయని మాజీ మంత్రులు అంబటి రాంబాబు, మేరుగ నాగార్జున, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి తదితర భజన బృందం, రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయటం సిగ్గుచేటని విమర్శించారు. వైసీపీ అగ్రనేతల అవినీతి, అరాచకాలతోపాటు వారి 'కామ కలాపాలు' ఒక్కొక్కటీ వెలుగు చూస్తుండటంతో ప్రజల దృష్టి మరల్చేందుకే ఈ డ్రామా ఆడుతున్నారని దుయ్యబట్టారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు స్థానాలు కోల్పోయిన రోజే వైసీపీ ఓటమి ఖరారైందని గుర్తుచేశారు. నాడు అసెంబ్లీలో చంద్రబాబుని, ఆయన కుటుంబ సభ్యులను తీవ్రంగా అవమానించిన వైసీపీ వచ్చే ఎన్నికల్లో సమాధి అయిపోతుందని అచ్చెన్నాయుడు చేసిన ప్రకటన వారికి గుర్తులేదా అని ప్రశ్నించారు. జగన్ లాంటి వంటి వ్యక్తి రాజకీయాలకే అనర్హుడని శ్రీనివాస్ అన్నారు.

ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకోవాలి

● కేజేఎస్ఎస్ కార్యదర్శి చుక్కపల్లి రమేష్



ఉపకార వేతనాలు పొందిన విద్యార్థినులతో దాతలు, పాలకవర్గ సభ్యులు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 28: దాతలు అందజేస్తున్న ఉపకార వేతనాలను సద్వినియోగించుకోవాలని కమ్మజనసేవా సమితి కార్యదర్శి చుక్కపల్లి రమేష్ అన్నారు. స్థానిక కుందులరోడ్డు, కమ్మ బాలికల వసతి గృహంలో వసతి పొందుతూ ఇంజనీరింగ్ చదువుతున్న ముగ్గురు విద్యార్థినులకు మంచికలపూడి పిచ్చయ్య ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.25వేలు చొప్పున మొత్తం రూ.75 వేలు ఉపకార వేతనాలు అందజేశారు. ఈ సందర్భంగా చుక్కపల్లి రమేష్, మంచికలపూడి పిచ్చయ్యలు మాట్లాడుతూ ఎన్ఆర్ఐ కవిత ఈ ఉపకార వేతనాలు అందజేస్తున్నారని వివరించారు. మంచి మార్కులు సాధిస్తే వచ్చే ఏడాది కూడా సాయం కొనసాగిస్తారని అన్నారు. ప్రతిభ కల్గిన విద్యార్థులకు కేజేఎస్ఎస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సేవాసమితి సంయుక్త కార్యదర్శి మర్రిపూడి సీతారామయ్య, మైనేని సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర సమావేశం

గుంటూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఈ నెల 29వ తేదీ గురువారం జరగనుందని కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాండురంగ విఠల్ ఒక ప్రకటనలో తెలిపారు. లాలుపురం రోడ్డులోని బీజేపీ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమౌతుందని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి ఈ సమావేశానికి హాజరౌతారని చెప్పారు.

విద్యుత్ అమరవీరుల స్ఫూర్తి కొనసాగించాలి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 28: విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో విద్యుత్ సంస్కరణ, స్మార్ట్ మీటర్ల బిగింపు, విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలని వామపక్షాలు పిలుపునిచ్చాయి. బ్రాడీపేట సీపీఎం జిల్లా కార్యాలయంలో బుధవారం విద్యుత్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమం జరిగింది. సీపీఎం, సీపీఐ నాయకులు పాశం రామారావు, వి.రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ గత రాష్ట్ర ప్రభుత్వం ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలు పెంచిందని, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల బిగించే ప్రయత్నం చేసిందన్నారు. నేడు స్మార్ట్ మీటర్ల పేరుతో విద్యుత్ ఛార్జీలు పెంచేందుకు ప్రయత్నిస్తుందని, ఈ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో నరసింహారావు, పి.కోటేశ్వరరావు, కె.శ్రీధర్, వై.నేతాజీ, బైరగాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

31న వైశ్వకర్మణ మహిళా సదస్సు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 28: వైశ్వకర్మణ విజ్ఞాన వేదిక, దేశీయ విశ్వ బ్రాహ్మణ సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూనగర్, సీతారామనగర్‌లోని వికాస తరంగిణి సేవా భవనంలో ఈనెల 31న వైశ్వ కర్మణ మహిళా సదస్సు నిర్వ హిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సులో వైదిక ధర్మచరణం- మహిళల పాత్ర అంశంపై టి.మోహన్‌రావుశర్మ ప్రసంగిస్తారన్నారు. వివరాలకు 94907 76603,9492904823లో సంప్రదించాలని సూచించారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ గుంటూరు సిటి, కృష్ణనగర్ కాపురస్తులైన లేటు మట్టా రామమోహనరావు గారి కుమారుడైన మట్టా శ్రీనివాస్ గారి సంజాయిషీ పొంది తెలియజేయునది:-

గుంటూరు సిటి, కొత్తపేట, ముప్పిరిశెట్టివారి వీధిలో డోరు నెం.12-18-21దుగా గల 525 చ.గ. అర్.సి.సి. డాబా నా క్లయింట్ మట్టా శ్రీనివాస్‌గారి తండ్రి గారైన మట్టా రామమోహన్‌రావు గారి స్వార్జితపు ఆస్తియై ఉండియున్నది. సదరు మట్టా రామమోహనరావు గారు ది.20.08.2017వ తేదిన ఎట్టి దస్తావేజు వ్రాయకుండా ఇంటెస్టేట్‌గా మరణించియున్నారు. సదరు మట్టా రామమోహనరావు గారికి వారి భార్య అయిన మట్టా లక్ష్మీతాయారు, కుమారులైన నాక్లయింట్ మట్టా శ్రీనివాస్ మరియు మట్టా శ్రీధర్, కుమార్తె దోగిపర్తి సుజాత వారసులై ఉన్నారు. సదరు పైన తెలిపిన డోర్ నెం.12-18-21దు గల ఆస్తిలో నా క్లయింట్ తల్లిగారైన మట్టా లక్ష్మీతాయారు నివసించుచున్నారు. ఇట్టి స్థితిలో మట్టా లక్ష్మీతాయారు గారిని ప్రలోభపరచి సదరు పై తెలిపిన ఇంటి నుంచి నాక్లయింట్ సోదరులైన మట్టా శ్రీధర్ మరియు దోగిపర్తి సుజాత ఖాళీ చేయించి సదరు ఆస్తిని ఇతరులకు అద్దెకు ఇచ్చుటకు మరియు అన్యాక్రాంతము చేయుటకు ప్రయత్నించుచున్నారు. కావున సదరు కొత్తపేట, ముప్పిరిశెట్టి వారి వీధిలో డోర్ నెం.12-18-21దు గల ఆస్తిపై ఎవరైనా ఏ విధమైన లావాదేవీలు జరిపిన యెడల చెల్లనేరవని ఈ ప్రకటన ద్వారా తెలియపరచటమైనది.

ఇట్లు, **మట్టుపల్లి వెంకట సుబ్బారావు,** అడ్వకేట్ మెయిన్‌రోడ్, 8-9, అరండల్‌పేట, గుంటూరు - 522 002.



ఎన్‌జీ రంగా వర్సిటీలో ఎన్ఆర్ఐ సెకండ్ ఫేజ్

గుంటూరులోని ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- ఎన్ఆర్ఐ కోటా కింద డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి సెకండ్ ఫేజ్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/కమ్యూనిటీ సైన్స్), బీటెక్ (అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లలో మిగిలిన సీట్లను భర్తీ చేయనున్నారు. అకడమిక్ ప్రతిభ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి సంబంధిత కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ అవసరం లేదు. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు.

సీట్ల వివరాలు

బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌లో 147 సీట్లు, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో 20 సీట్లు, ... ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ ప్రోగ్రామ్‌లో 15 సీట్లు ఉన్నాయి.

అర్హత

గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సుకు బయాలజీ, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్)కు మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. 2024 డిసెంబరు 31 నాటికి అభ్యర్థుల వయసు 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

దరఖాస్తు విధానం

వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొన్న దరఖాస్తు ఫారాన్ని నింపి ఇంటర్, పదోతరగతి మార్కుల పత్రాలు; ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఎన్ఆర్ఐ వీసా-పాస్‌పోర్ట్- ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి. అభ్యర్థులు తల్లిదండ్రుల వివరాలకు సంబంధించిన అఫిడవిట్, స్పాన్సరర్ ధ్రువీకరణ పత్రం కూడా సబ్మిట్ చేయాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 13
- **చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** www.angrau.ac.in

దిక్సూచి

అడ్మిషన్స్

ఏసీఎస్ఐఆర్‌లో పీహెచ్‌డీ

న్యూఢిల్లీలోని అకాడమీ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇన్నోవేటివ్ రీసెర్చ్(ఏసీఎస్ఐఆర్)- ఇంటిగ్రేటెడ్ డ్యూయెల్ డిగ్రీ ప్రోగ్రామ్(ఐడీడీపీ-ఎంటెక్&పీహెచ్‌డీ); పీహెచ్‌డీ 2025 జనవరి సెషన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దేశవ్యాప్తంగా ఉన్న అనుబంధ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లలో అడ్మిషన్స్ పొందవచ్చు.

పరిశోధన విభాగాలు

సైన్స్ విభాగాలు: బయలాజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, అగ్రికల్చరల్ సైన్సెస్, మేథమెటికల్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్

● మెడికల్ రీసెర్చ్ ● ఇంజనీరింగ్

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 16
- **వెబ్‌సైట్:** www.acsir.res.in/admissions

నిమ్స్‌లో ఎంహెచ్‌ఎం

రిమైండర్

హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)- 'మాస్టర్ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండున్నరేళ్లు. ఇందులో ఆర్నెల్ల కంపల్సరీ ఇంటర్న్‌షిప్ కూడా ఉంది. ఇది ఫుల్ టైమ్ ప్రోగ్రామ్. ఇందులో మొత్తం 20 సీట్లు ఉన్నాయి. తెలంగాణ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. 'నిమ్‌సెట్-ఎంహెచ్‌ఎం 2024'లో సాధించిన మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. కోర్సు సమయంలో ఇతర డిగ్రీ/డిప్లొమా ప్రవేశాలకు, ప్రైవేట్ ప్రాక్టీస్/కన్సల్టేషన్‌లకు అనుమతించరు. ప్రోగ్రామ్‌ను గరిష్ఠంగా ఎనిమిదేళ్లలో పూర్తి చేయాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.5,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.4,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 2
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 5
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** అక్టోబరు 3 నుంచి
- **నిమ్‌సెట్-ఎంహెచ్‌ఎం 2024 తేదీ:** అక్టోబరు 9న
- **ఫలితాలు విడుదల:** అక్టోబరు 10
- **అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** అక్టోబరు 15
- **కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** అక్టోబరు 17
- **ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్:** అక్టోబరు 26
- **తరగతులు ప్రారంభం:** నవంబరు 4 నుంచి
- **చిరునామా:** అసోసియేట్ డీన్, అకడమిక్-2, రెండో అంతస్తు, పాత ఓపీడీ బ్లాక్, నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, పంజాగుట్ట, హైదరాబాద్-500082
- **వెబ్‌సైట్:** nims.edu.in

కురుక్షేత్ర వర్సిటీలో పీజీ డిప్లొమా

కురుక్షేత్ర యూనివర్సిటీకి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ హిస్టరీ- 'పీజీ డిప్లొమా ఇన్ ఆర్కైవ్స్ అండ్ రికార్డ్స్ మేనేజ్‌మెంట్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇది ఈవెనింగ్ ప్రోగ్రామ్. దీనిని సెల్ఫ్ ఫైనాన్సింగ్ స్కీమ్ కింద నిర్వహిస్తున్నారు. మొత్తం 35 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత

గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో మాస్టర్స్ డిగ్రీ ఇన్ హిస్టరీ ఉత్తీర్ణులై ఉండాలి. మోడరన్ ఇండియన్ హిస్టరీ ఒక సబ్జెక్ట్‌గా చదివిన వారికి ప్రాధాన్యం ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; ఎస్సీ, బీసీ అభ్యర్థులకు రూ.250.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- ఎంపికైన అభ్యర్థుల మొదటి జాబితా విడుదల: సెప్టెంబరు 2న
- ఎంపికైన అభ్యర్థుల రెండో జాబితా విడుదల: సెప్టెంబరు 5
- తరగతులు ప్రారంభం: సెప్టెంబరు 9 నుంచి
- వెబ్‌సైట్: www.kuk.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/AxmEvBlలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

హీరోగా మారిన విలన్ కథ ఇది




నేను 'మగధీర' చిత్రానికి కో డైరెక్టర్‌గా పని చేశా. ఆ సమయంలోనే దేవ్ గిల్‌తో పరిచయం ఏర్పడింది. దేవ్ ఈ సినిమా ప్రపోజల్‌తో వచ్చాడు. అలా ఈ ప్రాజెక్ట్ మొదలైంది' అన్నారు దర్శకుడు త్రికోటి. దేవ్ గిల్ హీరోగా నటించిన 'అహో విక్రమార్క' చిత్రానికి ఆయన దర్శకత్వం వహించారు. ఈ నెల 30న ఆ సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ 'ఇందులో దేవ్ గిల్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్ర పోషించాడు. ఓ విలన్ హీరోగా మారితే ఎలా ఉంటుందనేది ఈ చిత్రకథ అనీ, మదర్ సెంటిమెంట్ కూడా ఉందనీ ఆయన తెలిపారు.

రచయిత నరసింగరావు కన్నుమూత



కృష్ణవంశీ దర్శకత్వం వహించిన 'గులాబీ', రామ్‌గోపాల్ వర్మ 'అనగనగా ఒకరోజు' లాంటి పలు హిట్ చిత్రాలకు మాటల రచయితగా పనిచేసిన నడిమింటి నరసింగరావు (72) కన్నుమూశారు. వయోభారం వల్ల వచ్చిన అనారోగ్య సమస్యలకు చికిత్స పొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

కౌంట్‌డౌన్ మొదలు



ప్రపంచ వ్యాప్తంగా సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న 'పుష్ప 2 ది రూల్' చిత్రం విడుదలకు కౌంట్ డౌన్ మొదలైంది. మరో వంద రోజుల్లో అంటే డిసెంబర్ 6న ఈ సినిమా విడుదల కానుందని మేకర్స్ పేర్కొంటూ పోస్టర్ విడుదల చేశారు. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి సుకుమార్ దర్శకుడు. నవీన్ యర్నేని, వై.రవిశంకర్ నిర్మాతలు. ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో ఉంది. మరో వైపు నిర్మాణానంతర పనులు కూడా శరవేగంతో జరుగుతున్నాయి. 'కంటెంట్ పరంగానే కాకుండా టెక్నికల్‌గా కూడా 'పుష్ప 2' అత్యున్నత స్థాయిలో ఉండబోతోంది. మీరు ఎంత ఎక్స్‌పెక్ట్ చేసినా అంతకు మించి 'తగ్గేదేలే' అనిపించే రీతిలో సినిమా ఉంటుంది' అని దర్శకనిర్మాతలు చెప్పారు. దేవిశ్రీప్రసాద్ పాటలు అలరిస్తాయని తెలిపారు.

అందరి పేర్లు బయటపెట్టాలి



మలయాళ చిత్ర ప్రముఖులపై లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో ఎఫ్ఈఎఫ్‌కేఏ (ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ కేరళ) దర్శకుల సంఘం ఓ కీలక ప్రకటనను విడుదల చేసింది. జస్టిస్ హేమ కమిటీ నివేదికలో లైంగిక వేధింపులకు పాల్పడిన అందరి పేర్లను బయట పెట్టాలంటూ ఎఫ్ఈఎఫ్‌కేఏ దర్శకుల సంఘం డిమాండ్ చేసింది. "ప్రస్తుతం ఈ విషయం కోర్టులో ఉన్నందున దీనిపై ఎక్కువ మాట్లాడాలనుకోవడం లేదు. లైంగిక వేధింపులకు పాల్పడ్డ అందరి పేర్లు బయటకి రావాలి. దోషులకు కఠిన శిక్ష పడాలి. నిందితులలో మా సంఘం సభ్యులున్నా.. మేం కలుగజేసుకోం" అని పేర్కొంది.

సిద్ధిఖీపై కేసు

మలయాళ నటుడు సిద్ధిఖీపై నటి రేవతి సంపత్ లైంగిక ఆరోపణల నేపథ్యంలో సిద్ధిఖీపై పోలీసులు అత్యాచారం కేసు నమోదు చేశారు. అలాగే, బెంగాలీ నటి శ్రీలేఖ మిత్ర చేసిన ఆరోపణల నేపథ్యంలో దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్‌పై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు.

తెలుగు ఇండస్ట్రీలో మరీ ఎక్కువ

నటి షకీలా తెలుగు, తమిళ ఇండస్ట్రీలపై షాకింగ్ కామెంట్స్ చేశారు. "లైంగిక వేధింపులు కేవలం మలయాళ చిత్రసీమలోనే కాదు.. తమిళ ఇండస్ట్రీలోనూ ఉన్నాయి. తెలుగు ఇండస్ట్రీలో అయితే మరీ ఎక్కువగా ఉన్నాయి. అడ్జస్ట్‌మెంట్లు, కమిట్‌మెంట్ల గురించి మేనేజర్లు ముందే అడుగుతారు" అని ఆరోపించారు.

నోరు విప్పితే ట్రబుల్‌మేకర్స్ ముద్ర

హేమ కమిటీ రిపోర్ట్‌ను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు బాలీవుడ్ నటి స్వర భాస్కర్. "హేమ కమిటీలో వెలువడిన చీకటి వాస్తవాలు చూసి షాకయ్యా. బాధితులు ఎవరైనా ఏ విషయంపై అయినా నోరు తెరచి మాట్లాడితే వారిని ట్రబుల్‌మేకర్స్‌గా ముద్ర వేస్తారు" అని స్వర భాస్కర్ పేర్కొన్నారు. ప్రతి పరిశ్రమలోనూ మహిళలు ఇలాంటి పరిస్థితులే ఎదుర్కొంటున్నారని నటి, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఖుష్బూ అన్నారు. వేధింపులను వెలుగులోకి తెచ్చేందుకు హేమ కమిటీ రిపోర్ట్ ఉపయోగపడిందన్నారు. ఈ నివేదిక మనలో మార్పు తీసుకురావాలి అని ఆమె ఆకాంక్షించారు.

ఇన్ ప్రోగ్రెస్

గన్నూ.. గర్ల్!



శ్రీ సింహా కోడూరి, సత్య ప్రధాన పాత్రధారులుగా రూపొందిన 'మత్తు వదలరా' చిత్రానికి ఇప్పుడు సీక్వెల్ వస్తోంది. రితేశ్ రానా దర్శకత్వంలో చిరంజీవి(చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ ఫరియా అబ్దుల్లా నిధి పాత్ర పోషిస్తున్నారు. గన్ పట్టుకుని ఇంటెన్స్ లుక్‌లో ఉన్న ఫరియా ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. సునీల్, వెన్నెల కిశోర్, అజయ్, రోహిణి తదితరులు నటించిన ఈ చిత్రం సెప్టెంబర్ 13న విడుదల కానుంది.

సెప్టెంబర్‌లో జిగేల్



త్రిగుణ్, మేఘనా చౌదరి జంటగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ థ్రిల్లర్ 'జిగేల్'. మల్లి యేలూరి దర్శకత్వంలో డాక్టర్ వై జగన్ మోహన్, నాగార్జున అల్లం నిర్మిస్తున్నారు. బుధవారం చిత్రబృందం ఫస్ట్‌లుక్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. 'సెప్టెంబర్‌లో 'జిగేల్' చిత్రాన్ని విడుదల చేస్తాం. యువతను ఆకట్టుకునే కథతో తెరకెక్కుతోంది' అని నిర్మాతలు చెప్పారు. రఘుబాబు, పృథ్వీ కీలకపాత్రలు పోషిస్తున్నారు. సంగీతం: ఆనంద్ మంత్ర

నీలి మేఘములలో...



రానా దగ్గుబాటి సమర్పణలో నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ ప్రధాన పాత్రలు పోషించిన '35 చిన్న కథ కాదు' చిత్రం సెప్టెంబర్ 6న తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. నందకిశోర్ ఈమని దర్శకత్వంలో సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మిస్తున్నారు. లీడ్ పెయిర్ జర్నీని అందంగా ఆవిష్కరిస్తూ భరద్వాజ్ గాలి రాసిన 'నీలి మేఘములలో' పాటను బుధవారం విడుదల చేశారు. వివేక్ సాగర్ ఈ గీతానికి స్వరాలు అందించారు.

ప్రేమికుడి వీక్షణం



యువ కథానాయకుడు రామ్ కార్తీక్ హీరోగా, కశ్వి హీరోయిన్‌గా నటించిన 'వీక్షణం' చిత్రం తొలి కాపీతో విడుదలకు సిద్ధమైంది. మనోజ్ పల్లేటి దర్శకత్వంలో పి.పద్మనాభరెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. బుధవారం సిద్ శ్రీరామ్ పాడిన 'ఎన్నెన్నో' పాటను విడుదల చేశారు. ప్రేమలో మునిగిన ప్రేమికుడి మనసుని ఆవిష్కరించే ఈ పాటను రెహ్మాన్ రాయగా, సమర్థ్ గొల్లపూడి స్వరాలు సమకూర్చారు.

సాధనకు దీక్ష అవసరం



తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న 'దీక్ష' చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తయింది. కిరణ్ కుమార్, అలేఖ్యారెడ్డి జంటగా నటించిన ఈ చిత్రాన్ని పినిశెట్టి అశోక్‌కుమార్, మదాడి కృష్ణారెడ్డి నిర్మిస్తున్నారు. బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ 'దీక్ష ఉంటే ఏదైనా సాధించగలం.. అనే పాయింట్‌తో ఈ సినిమాను రూపొందించాం.' అని కోరారు. ఒక మంచి సినిమాలో అవకాశం కల్పించిన దర్శకనిర్మాతలకు హీరో, హీరోయిన్లు కృతజ్ఞతలు తెలిపారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ శేషన్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తదితరులు

పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించండి

● మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట ఆగస్టు 28: పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని పట్టణ మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులను ఆదేశించారు. స్థానిక మారీసుపేటలోని లోయర్ వార్ఫ్‌లో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు పట్టణ సుందరీకరణలో భాగంగా పారిశుధ్యంపై ప్రత్యేక ప్రణాళికను రూపొందించి అమలు పరుస్తున్నామన్నారు. వార్ఫులోని ముళ్ళ కంపలను, పిచ్చిచెట్లను తొలగిస్తున్నామన్నారు. ప్రతిఒక్కరూ పట్టణ సుందరీకరణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల కడుపు నింపుతున్నది అన్న క్యాంటీన్‌లే

● దాత వెంకట గంగాధర శాస్త్రి ● రూ.50వేల చెక్కు అందజేత

తెనాలి, మారీసుపేట ఆగస్టు 28: పట్టణంలోని పేద ప్రజల కడుపునింపుతున్నది అన్న క్యాంటీన్‌లేనని దాత కుప్ప వెంకట గంగాధరశాస్త్రి అన్నారు. పట్టణ పురపాలక సంఘ కార్యాలయంలో బుధవారం కమిషనర్ బి.శేషన్నకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌ల నిర్వహణ కోసం వెంకటగంగాధర శాస్త్రి రూ.50వేల చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పేద ప్రజల కోసం నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌కు తనవంతు సాయంగా రూ.50వేల చెక్కును అందించానన్నారు. అన్న క్యాంటీన్‌లకు తమవంతు సాయాన్ని అందిస్తున్న దాతలను కమిషనర్ శేషన్న ప్రశంసించారు.



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు సింహాచలం, దీపక్ తదితరులు

పాండురంగపేటలో 100 మందికి వైద్య పరీక్షలు

తెనాలి అర్బన్, మారీసుపేట, ఆగస్టు 28: స్థానిక పాండురంగపేట ఎన్టీఆర్ రోడ్డులో బుధవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఐక్యవేదిక సేవా ట్రస్ట్ వారు రోహిణి హాస్పటల్ గంగానమ్మపేట వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 27వ వార్డు కౌన్సిలర్ బోయపాటి అరుణ పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. నల్లగండ్ల పెదరంగయ్య వర్ధంతి పురస్కరించుకుని ఏర్పాటు చేసిన శిబిరంలో రోహిణి ఆసుపత్రి వైద్యులు సింహాచలం, దీపక్, శ్యామ్‌లు 100మంది రోగులకు బీపీ, షుగర్ పరీక్షలను నిర్వహించి ఉచిత మందులను, వైద్య సలహాలను అందించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక వ్యవస్థాపకుడు కిరణ్‌కుమార్, రూరల్ అధ్యక్షుడు జశ్వంత్ కృష్ణ, సాల్మన్, బండ్లమూడి నాని, రావూరి నరేష్, గోవింద్, రవిచంద్ర, మార్తా నర్సింగ్ విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అర్చక సంఘ నేతలు

ముఖ్యమంత్రి నిర్ణయంపై అర్చకుల హర్షం

తెనాలి అర్బన్, ఆగస్టు 28: అర్చక సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయానికి జిల్లా అర్చక సంఘం హర్షం వ్యక్తం చేసింది. బుధవారం తెనాలిలో విలేకరులతో రాష్ట్ర అర్చక ఆర్గనైజింగ్ కార్యదర్శి అనంతాచార్యులు మాట్లాడుతూ, అర్చకుల వేతనాన్ని రూ.10వేల నుంచి రూ.15 వేలకు పెంచడం ధూపదీప నైవేద్యాలకు వెచ్చించే రూ.5వేలు నుంచి రూ.10 వేలకు పెంచడం సముచిత నిర్ణయమని అభినందించారు. ఎంతోమంది అర్చకులు చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారని, ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం ప్రతి ఒక్కరికి మంచి చేస్తుందన్నారు. నిరుద్యోగులకు కూడా భృతి వెంటనే అందించే ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించడంపై సంతోషం వ్యక్తంచేశారు. భక్తుల మనోభావాలనే కాకుండా అర్చకుల సంక్షేమానికి కూడా కృషిచేయడం ఆనందదాయకమన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో పండితులకు ప్రతినెలా ఇచ్చే పెన్షన్ స్కీంకు దరఖాస్తులు తీసుకునేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. అర్చక సంఘ నాయకులు ఆత్రేయ, గురునాథప్రసాద్, కేశవ తదితరులు పాల్గొన్నారు.

సినీ పరిశ్రమ అభివృద్ధిపై దృష్టి సారించాలి

● మంత్రికి ఏపీ మా వ్యవస్థాపక అధ్యక్షుడు దిలీప్‌రాజా వినతి

తెనాలి అర్బన్, ఆగస్టు 28: రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధికి దృష్టి సారించాలని సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి విన్నవించామని ఏపీ మా వ్యవస్థాపక అధ్యక్షుడు దిలీప్‌రాజా తెలిపారు. సచివాలయంలో బుధవారం మంత్రిని కలిసి మాట్లాడామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రితో సినీ పరిశ్రమపై సమీక్షించేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానని మంత్రి వారికి హామీ ఇచ్చినట్లు చెప్పారు. రాష్ట్రంలో సినిమా నిర్మాణానికి ఉచితంగా లోకేషన్లు ఇవ్వడం, స్టూడియోల నిర్మాణం, సినీ కార్మికులకు ఇళ్ల స్థలాలు, సబ్సిడీ పెంపుదల వంటి అంశాలు ముఖ్యమంత్రితో చర్చించాలని కోరామన్నారు. ఆయనతో పాటు బుల్లితెర దర్శకుడు అచ్చన శ్రీనివాస్ మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

విద్యాభివృద్ధికి పూర్వ విద్యార్థుల కృషి అభినందనీయం

● న్యాయవాది కంభం విజయ్‌కుమార్

తెనాలి అర్బన్, ఆగస్టు 28: కొల్లిపర పాఠశాలతో పాటు విద్యార్థుల కోసం చేస్తున్న కృషి అభినందనీయమని న్యాయవాది కంభం విజయ్‌కుమార్ ప్రశంసించారు. మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘాన్ని ఏర్పాటుచేసిన తన్నీరు శివశంకర్‌ను బుధవారం సన్మానించారు. రాధా రంగా మిత్రమండలితో పాటు పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో దాది సూరయ్య, రవికుమార్, శ్రీనివాసరావు, భానుప్రసాద్, హేమకుమార్, నరేంద్ర పాల్గొన్నారు.



శ్రావణ పట్టీని తీసుకుని వస్తున్న భక్తులు

మహాలక్ష్మీ అమ్మవారికి శ్రావణ పట్టీ అందజేత

పెదకాకాని, ఆగస్టు 28: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట ఉన్న శ్రీ దశావతార వెంకన్నస్వామి దివ్య క్షేత్రంలోని మహాలక్ష్మీ అమ్మవారికి శ్రావణమాసం సందర్భంగా బుధవారం భక్తులు శ్రావణపట్టీని అందించారు. విజయవాడకు చెందిన శివశంకర్ సీతామహాలక్ష్మి దంపతులు, కుటుంబ సభ్యులు శ్రావణ పట్టీని సమర్పించారు.

పవన్‌కల్యాణ్ జన్మదినం రోజున

పట్టణాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుదాం

● రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



మొక్కలు నాటే కార్యక్రమంపై శేషన్న, జనార్థనరావులకు సూచనలు చేస్తున్న మంత్రి మనోహర్

తెనాలి రూరల్, ఆగస్టు 28: జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదినం రోజున పట్టణాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేలా పలు రకాల మొక్కలను నాటుదామని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి, జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. సెప్టెంబరు 2న పవన్‌కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని తెనాలి ప్రధాన రహదారి వెంట మొక్కలు నాటే కార్యక్రమంపై మునిసిపల్ కమిషనర్ శేషన్న, డీఎస్పీ జనార్థన్‌రావులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ తెనాలి పట్టణాన్ని పరిశుభ్రతలకు పచ్చదనానికి నిలయంగా సుందరీకరించేలా కార్యాచరణతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టినరోజును ప్రజలందరికీ ఉపయోగపడేలా మంచి కార్యక్రమాలతో ముందుకు వెళ్లనున్నట్లు తెలిపారు. పలువురు జనసేన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు నూతన యాజమాన్య పద్ధతులు పాటించాలి

● జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్‌పవార్

కొల్లిపర, ఆగస్టు 28: రైతులు నూతన యాజమాన్య పద్ధతులు పాటించటం వలన నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్‌పవార్ అన్నారు. బుధవారం మండల కేంద్రం కొల్లిపర శ్రేష్ఠ రైతు ఉత్పత్తిదారుల సేకరణ కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సమావేశానికి శ్రేష్ఠ ఏఫ్‌పీసీ ఛైర్మన్ నెర్ల కుటుంబరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా స్వప్నిల్‌పవార్ మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయ పద్ధతి ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించటానికి అవకాశం ఉందన్నారు. సేంద్రియ వ్యవసాయ ద్వారా పంటలు పండిస్తే ఆ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందన్నారు. రైతులు పంట మార్పిడి చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం మండలంలోని మున్నంగి, కొల్లిపర, తూములూరు తదితర గ్రామాల్లో అరటి, పసుపు పంటలను పరిశీలించారు. రైతుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్‌పవార్

సమావేశంలో ఉద్యానవన శాఖాధికారి ఉషా, శ్రేష్ఠ రైతు ఉత్పత్తిదారుల సంఘ సభ్యులు డైరెక్టర్ ఉయ్యూరు సాంబిరెడ్డి, బొంతు గోపాల్‌రెడ్డి, దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శేకూరులో పంట కాల్వపూడిక తీత పనులు ప్రారంభం

చేబ్రోలు, ఆగస్టు 28: శేకూరులో పంట కాల్వ పూడికతీత పనులను ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆదేశాలతో బుధవారం సాగునీటి శాఖ అధికారులు ప్రారంభించారు. గ్రామంలో పంట కాల్వలో గత ఐదేళ్లుగా నిర్వహణ కార్యక్రమాలు చేపట్టని కారణంగా కాల్వలో పిచ్చిచెట్లు మొలిచి తూడికాడ, గుర్రపుడెక్కతో నిండిపోయింది. కాల్వ చివరి భూములుగా శేకూరు గ్రామం ఉండటంతో గ్రామంలో పంటల సాగుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాల్వలో నీటి ప్రవాహానికి అడ్డంగా తూటికాడ పెరిగిపోవటంతో సాగునీరు పంట భూములకు అందక పంట పొలాలు బీడుభూములుగా మారిపోయాయి. ఎన్నికల సమయంలో ఆ గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌కు గ్రామస్థులు తమ ఇబ్బందులను ఏకరువుపెట్టారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీమేరకు పంట కాల్వ పూడికతీత పనులను ప్రారంభించారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కాల్వలో పెరిగిన పిచ్చిచెట్లు తొలగిస్తున్న ఎస్కవేటర్



మిర్యాలగూడలో సంగం ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఛైర్మన్ నరేంద్ర కుమార్

మిర్యాలగూడలో సంగం ప్లాంట్ ప్రారంభం

పొన్నూరుటౌన్, ఆగస్టు 28: తెలంగాణ రాష్ట్రంలో సంగం సేవలను విస్తరించేందుకు మిర్యాలగూడలో సంగం ప్లాంట్‌ను ఏర్పాటుచేసినట్లు సంగం డెయిరీ ఛైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడలో బుధవారం సంగం డెయిరీ నూతనంగా నిర్మించిన ప్లాంట్‌ను ట్రైయిల్ రన్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం ఛైర్మన్ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ మిర్యాలగూడ శ్రీనివాసనగర్ గ్రామంలో లక్షన్నర లీటర్ల సామర్థ్యంతో అత్యాధునిక యంత్ర సామగ్రితో సంగం డెయిరీ ప్లాంట్‌ను ఏర్పాటుచేసినట్లు చెప్పారు. ఈ ప్లాంట్ పరిధిలో తెలంగాణలోని నల్గొండ, ఖమ్మం, భద్రాద్రి, కొత్తగూడెం, హైదరాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలకు సంగం ఉత్పత్తులను సరఫరాచేసే లక్ష్యంతో ఈ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పాల సేకరణ లక్ష్యంలో భాగంగా 6 చిల్లింగ్ సెంటర్లను ఏర్పాటు చేయనునట్లు చెప్పారు. భవిష్యత్తులో ఈ ప్లాంట్‌ను 3లక్షల లీటర్ల సామర్థ్యంతో విస్తరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎండీ పి గోపాళకృష్ణన్, పాలకవర్గ సభ్యులు సంగం డెయిరీ వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం

పొన్నూరు టౌన్, ఆగస్టు 28: మండల పరిధిలోని మామిళ్లపల్లిలో పూరిల్లు దగ్ధమైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన దేవరకొండ కమలయ్య గృహంలో మంటలు చెలరేగి పూరిల్లు, పశువుల చావిడికి మంటలు అంటుకున్నాయి. అగ్ని ప్రమాదంలో పూరిల్లు, చావిడి పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ప్రమాదంలో రెండు పశువులకు గాయాలు కాగా, సుమారు రూ.50వేల ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు వెల్లడించారు.



మామిళ్లపల్లిలో అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైన పూరిల్లు



సమావేశంలో మాట్లాడుతున్న బాబుప్రసాద్

విద్యుత్ చార్జీలపై ఇచ్చిన హామీలు అమలు చేయాలి

తెనాలి అర్బన్, ఆగస్టు 28: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో విద్యుత్ చార్జీలపై ఇచ్చిన హామీని అమలు చేయాలని సీపీఎం కార్యదర్శి కొల్లిపర బాబు ప్రసాద్ కోరారు. చెంచుపేట ప్రజాసంఘాల కార్యాలయంలో బుధవారం 2000వ సంవత్సరంలో బషీర్‌బాగ్ పోలీసు కాల్పుల్లో మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ములకా శివసాంబిరెడ్డి, వెంకటసుబ్బయ్య, రవికుమార్, కళావతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్వర్ణ వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

పొన్నూరు టౌన్, ఆగస్టు 28: పొన్నూరు పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీస్వర్ణ వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం బుధవారం కన్నుల పండువగా జరిగింది. స్వామివారి ఆలయ బ్రహోత్సవాలో భాగంగా ఉదయం స్వామి వారి ఉత్సవమూర్తులకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను కల్యాణ క్రతువుకు సిద్ధం చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా రూపొందించిన కల్యాణ మండపంపై ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించి స్వామివారి దివ్య తిరు కల్యాణ మహోత్సవాన్ని అంగరంగా వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు.



స్వర్ణ వెంకటేశ్వర స్వామికి పంచామృత అభిషేకాలు చేస్తున్న అర్చకుడు

గ్రామసభతో ఉపాధిహామీ కూలీల సమస్యల పరిష్కారం

● జిల్లా అంబుడ్స్ పర్సన్ కౌముది



జిల్లా అంబుడ్స్ పర్సన్ కౌముదికి దరఖాస్తు అందజేస్తున్న ఉపాధిహామీ కూలీలు

కొల్లిపర, ఆగస్టు 28: ఉపాధిహామీ కూలీల సమస్యలు పరిష్కరించేందుకు గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా అంబుడ్స్ పర్సన్ ఎంఎస్ కౌముది అన్నారు. బుధవారం మండల పరిధిలోని తూములూరు, కొల్లిపర పంచాయతీ కార్యాలయాల్లో ఆమె గ్రామ సభ నిర్వహించారు. ఉపాధిహామీ కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తూములూరు గ్రామసభలో పీల్డ్ అసిస్టెంట్ పనితీరు బాగోలేదని అతనిని విధులు నుంచి తొలగించాలని ఉపాధి హామీ కూలీలు దరఖాస్తు ద్వారా ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కౌముది మాట్లాడుతూ ఉపాధిహామీ కూలీలు గ్రామసభలో తెలిపిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించనున్నట్లు తెలియజేశారు. గ్రామసభలో ఉపాధి హామీ పీల్డ్‌అసిస్టెంట్‌లు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నేడు కంచర్లపాలెంలో వైద్యశిబిరం

తెనాలి రూరల్, ఆగస్టు 28: కొలకలూరు పీహెచ్‌సీ పరిధిలోని కంచర్లపాలెంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ సుబ్బారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30గంటలకు ప్రారంభమయ్యే వైద్యశిబిరానికి అనారోగ్య సమస్యలున్న వారు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుని తగిన మందులు పొందాలని కోరారు. ఇదే శిబిరంలో సీజనల్ వ్యాధుల బారినపడకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం కూడా జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆవిష్కరణకు నోచని శిలాఫలకం



తెనాలి అర్బన్, ఆగస్టు 28 : వైకుంఠపురం అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకం ఆవిష్కరణకు నోచుకోలేదు. మూడు రోజుల పాటు ఏర్పాటు చేసిన మహాసంప్రోక్షణ కార్యక్రమాలలో చివరి రోజు మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా పూజలు జరిపించారు. ప్రధాన ఆలయంలో జరిపిన అభివృద్ధి శిలాఫలకాన్ని మంత్రి మనోహర్ ప్రారంభించాల్సి ఉంది. అయితే శిలాఫలకం ప్రారంభించకుండానే మిగిలిన పూజాది కార్యక్రమాల్లో మంత్రి పాల్గొని వెనుదిరిగారు. దేవదాయ శాఖ ఈ శిలాఫలకం ఎందుకు ఏర్పాటు చేసిందోనని పలువురు విమర్శిస్తున్నారు.

1న యూపీఎస్‌కు వ్యతిరేకంగా నిరసన: ఏపీటీఎఫ్

గుంటూరు (విద్య), ఆగస్టు 28: ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులపై బలవంతంగా రుద్దబోతున్న యూనిఫైడ్ సర్వీస్ పెన్షన్‌కు వ్యతిరేకంగా సెప్టెంబరు 1న అన్ని తాలుకా కేంద్రాల్లో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్ ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వం వారం రోజుల్లో సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ అమలు చేస్తామని గద్దెనెక్కి, 5 సంవత్సరాలలో ఇచ్చిన హామీ అమలు పర్చకపోగా ఎవరూ అడగని జీపీఎస్ (గ్యారంటీడ్ పెన్షన్ స్కీమ్) బలవంతంగా రుద్దారని తెలిపారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం కూడా జీపీఎస్ లాంటి యూపీఎస్‌ను వచ్చే ఏప్రిల్ 2025 నుంచి 50 శాతం పెన్షన్‌తో అమలు చేస్తామని చెప్పడం లక్షలాది కేంద్ర ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేయడమే నన్నారు. జీపీఎస్ అయినా, యూపీఎస్ అయిన ఉద్యోగి కాంట్రిబ్యూషన్ లేకుండా లేదన్నారు. ఉద్యోగి తన జీతం నుండి ఎలాంటి కాంట్రిబ్యూషన్ లేని పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) మాత్రమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయల అసంబద్ధ సంక్షేమ విధానాలకు వ్యతిరేకంగా సెప్టెంబరు 1న గుంటూరు జిల్లాలో ని గుంటూరు, పొన్నూరు, తెనాలి, మంగళగిరి తాలుకా కేంద్రాల్లో నిరసన ప్రదర్శన చేపడతామని తెలిపారు.

యువత ఆత్మహత్యలకు ప్రధాన కారణం ఒత్తిడి

● సైకాలజిస్ట్ డాక్టర్ నగరాజకుమారి



తెనాలి, మారీసుపేట ఆగస్టు 28: నేటి సమాజంలో యువత ఆత్మహత్యలకు ప్రధాన కారణం ఒత్తిడేనని సైకాలజిస్ట్ డాక్టర్ నాగరాజకుమారి అన్నారు. స్థానిక నాజరుపేట కొల్లూరు వారి వీధిలోని పద్మావతి కౌన్సెలింగ్ సెంటర్‌లో బుధవారం యువత ఆత్మహత్యల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని డాక్టర్ నాగరాజకుమారి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత ఆత్మహత్యలకు ప్రధాన కారణం ఒత్తిడి అన్నారు. ఆ ఒత్తిడి అనేక రకాలు ఉంటుందని అనారోగ్యం, ఒంటరితనం, నిరుద్యోగం, మొదలైనవన్నారు. ఒత్తిడిని జయించడానికి మానసికబలం లేకపోవడం కూడా ఒక కారణమన్నారు. ముఖ్యంగా ఆత్మహత్యలకు పాల్పడేవారి లక్షణాలను గుర్తించవచ్చన్నారు. ఆకలి లేకపోవడం, నిద్రలేమి, దేనిమీద ఆసక్తి లేకపోవడం, కన్నీళ్లు పెట్టడం, తనకు ఎవరు సాయం చేసేవారు లేరనట్టు ప్రవర్తిస్తుంటారని తెలిపారు. వీరిని కుటుంబ సభ్యులు, స్నేహితులు గుర్తించి మానసిక నిపుణుల సలహాలను తీసుకోవాలని, యోగ, ధ్యానం, వ్యాయామం సమతల ఆహారం అందించాలన్నారు. ముఖ్యంగా యోగా, కౌన్సిలింగ్‌ల వల్ల వీరు జీవితంలో నిరంతరం ఎదుర్కొనే వ్యతిరేక ఆలోచనల నుంచి బయటకు రావడానికి సహాయ పడతాయని అన్నారు.



ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రశాంతి

ఇసుక బుకింగ్ సెంటర్ ప్రారంభం

పొన్నూరు టౌన్, ఆగస్టు 28: పొన్నూరు నియోజకవర్గ పరిధిలో తహసీల్దార్ కార్యాలయంలో ఉచిత ఇసుక బుకింగ్ సెంటర్‌ను ప్రారంభించినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రశాంతి తెలిపారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆన్‌లైన్ బుకింగ్ కౌంటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రశాంతి మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఈ కౌంటర్ పనిచేయనునట్లు చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా ఉచిత ఇసుకను బుకింగ్ చేసుకునే వారు ఆధార్ కార్డు, డ్రైవర్, వాహన వివరాలను తీసుకొని రావాలన్నారు. కౌంటర్‌లో ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు కట్టి బుక్ చేసుకున్న వినియోగదారులకు ఆన్‌లైన్‌లో స్లాట్ కేటాయించనునట్లు చెప్పారు. కేటాయించిన స్లాట్ సమయానికి ఇసుక స్టాక్ యార్డుల వద్ద నేరుగా లోడింగ్ చేయనునట్లు చెప్పారు. ఒక వ్యక్తికి రోజుకు 20 మెట్రిక్ టన్నుల ఇసుక మాత్రమే ఇవ్వబడుతుందన్నారు. స్లాట్ బుకింగ్ లేని వాహనాలు స్టాక్ యార్డ్ లోపలికి అనుమతించరన్నారు. ఉచిత ఇసుక కౌంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదాల వెంకటేశ్వరరావు, ఆకుల సాంబశివరావు, బండ్లమూడి బాబురావు, పఠాన్ అహ్మద్‌ఖాన్, పఠాన్ ఫిరోజ్‌ఖాన్, లక్ష్మీనారాయణ చౌదరి, జనసేన పట్టణ అధ్యక్షుడు షేక్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

కేరళ బాధితులకు రూ.10 వేల విరాళం

పొన్నూరు టౌన్, ఆగస్టు 28: ఇటీవల కేరళ రాష్ట్రం వయనాడ్‌లో జరిగిన ప్రకృతి విపత్తు బాధితులకు పొన్నూరు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి నాయకులు బుధవారం రూ.10 వేల విరాళాన్ని బ్యాంక్ ద్వారా పంపించారు. వయనాడ్‌లో జరిగిన విపత్తులో సర్వం కోల్పోయిన కుటుంబాలను ఆదుకోవాలని ఇండియన్ పీపుల్స్ థియేటర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు పొన్నూరులో విరాళాలు సేకరించారు. పట్టణంలోని వీధుల్లో సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తూ ఈ విరాళాలను సేకరించి బ్యాంక్ ఖాతాలో జమచేశారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి కళాకారులు ఘంట రాజేంద్రకుమార్, గుంపుల చిట్టిబాబు, దేవరకొండ శ్రీనివాస్, దాసరి అంకమయ్య, ఆరేటి సురేష్, పధుమర్తి రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాల రైతుల శ్రేయస్సే సంగం లక్ష్యం: బొర్రు

పొన్నూరు టౌన్, ఆగస్టు 28: పాల రైతుల శ్రేయస్సే సంగం లక్ష్యం అని ఆ సంస్థ పాలకవర్గ సభ్యుడు బొర్రు రామారావు అన్నారు. మండల పరిధిలోని మాచవరంలో బుధవారం 133 మంది పాల రైతులకు రూ.3,44,123 బోనస్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ నరేంద్రకుమార్ పాల రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న డీవీసీ అభయ పథకాలను వివరించారు. కార్యక్రమంలో అప్పికట్ల చిల్లింగ్ సెంటర్ మేనేజర్ కాట్రు నరేష్‌బాబు, సూపర్‌వైజర్ బాలకిషోర్, సొసైటీ అధ్యక్షుడు మట్టా రంగయ్య, కార్యదర్శి యలవర్తి శివానందం పాల్గొన్నారు.

నారాకోడూరు పాఠశాలకు స్పోర్ట్స్ ఎక్స్‌లెన్స్ అవార్డు

చేబ్రోలు, ఆగస్టు 28: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని నారాకోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు స్పోర్ట్స్ ఎక్స్‌లెన్స్ అవార్డు లభించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఏడుకొండలు బుధవారం తెలిపారు. క్రీడల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన చేసినందుకు ఈ అవార్డు లభించినట్లు చెప్పారు. పాఠశాల స్థాయి నుంచి జాతీయస్థాయి వరకు హ్యాండ్ బాల్ పోటీలలో పాఠశాలకు చెందిన 10మంది క్రీడాకారులు బహుమతులు పొందారన్నారు. రాష్ట్ర స్థాయిలో 22మంది, జిల్లా స్థాయిలో 7 గురు గోల్డ్ మెడల్ సాధించినట్లు చెప్పారు. బాలికల్లో నలుగురు బ్రాంజ్ మెడలు సాధించారన్నారు. ఈ అవార్డు రావటానికి కారణమైన వ్యాయామ ఉపాధ్యాయులు బి.వెంకటేశ్వరరావు, ఎస్.ఉమామహేశ్వర్లును ప్రత్యేకంగా అభినందించారు.